దత్తజయంతి మహోత్సవ ప్రత్యేక వ్యాసం

# శ్రీ దత్తజయంతి

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శ్రీ పాదస్వామి గాని, శ్రీ నృసింహసరస్వతీ స్వామి గాని తాము భగవదవతారములమని లోకానికి చాటుకోలేదు. శ్రీరాముడు కూడ ఆత్మానం మానుషం మన్యే, 'నన్ను నేను మానవుడు గానే తలస్తున్నాను' అనడం గమనార్హం. శ్రీ కృష్ణ పరమాత్మ తాను భగవదవతారమని అర్జునుడివంటి అంతరంగికులకు కొద్దిమందికి మాత్రమే చెప్పాడుగాని లోకానికి చాటలేదు. వేదవ్యాసుల వంటి సత్యద్రష్టలు కొద్దిమంది మాత్రమే ఈ రహస్యాన్ని గుర్తించి లోకానికి తెలియబరచారు. కాబట్టి నిజమయిన అవతారపురుషుడెవ్వడూ తన నిజతత్త్వాన్ని లోకానికి చాటుకోడని మనం గమనించాలి.

ఈ అవతారమూర్తులందరూ తమనిజమైన విశ్వరూపాన్ని అంతరంగికులకు ప్రసాదించి అనుభవపూర్వకంగా తమ దైవత్వాన్ని నిరూపించారు. అలాగాని పౌండరీక వాసుదేవుని వంటి కీర్తి కాములు మాత్రమే తాము అవతార పురుషులమని లోకాన్ని నమ్మింపజూచారు.

అవతార పురుషులందరూ సద్గురువుల నాశ్రయించి సత్సాంప్రదాయాన్ని పాటించారేగాని తమకట్టి ఆలంబనాలు అనవసరమని, తాము సర్వధర్మాలకు అతీతులమనీ చెప్పి స్వేచ్ఛాచారులు కాలేదని గమనించాలి. అవతార పురుషులందరిలాగే వీరిద్దరూ తాము జన్మతః పరిపూర్ణులయినప్పటికీ వినమ్రులై సాధకునివలెనే ప్రవర్తించారు గాని సిద్ధులమని విర్రవీగలేదు.

వీరు దివ్యలీలలను ప్రదర్శించినప్పటికీ అవి ఆర్తులను రక్షించడానికో, లేక నిర్దుష్టమయిన ఆధ్యాత్మిక భావనను భక్తులకు ప్రసాదించి వారిని మోక్షోన్ముఖులుగా చేసేవిగా మాత్రమే ఉన్నాయి. కేవలం తమ శక్తి సామర్థ్యములతో లోకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచి తమకు కీర్తిని చేకూర్చే సాధనాలయిన చిల్లర చమత్కారాలను వారెన్నడూ ప్రదర్శించక పోవడం గమనార్హం.

శ్రీ సాయి సాటిలేని సద్గురువు, పరిపూర్ణ దత్తావతారం. శ్రీ సాయి దత్తాత్రేయుల వారి అవతారమనడానికి ఆయన చరిత్రలో అనేక ఆధారాలున్నాయి. త్రిమూర్త్యాత్మకుడైన దత్తాత్రేయులవారు ప్రపంచంలో ఆధ్యాత్మిక విద్యకు ఆది దేవతగా అవతరించారు. అందుకని వివిధ ప్రాంతాలలో, మతాలలో, కాలాలలో వెలసిన మహనీయులంతా ఆయన రూపాలేనని చెప్పడానికి వీలయిన విధంగా పురాణాంతర్గతమయిన దత్త కథలున్నాయి. ఉదాహరణకు హిందూ మతంలో దత్తాత్రేయుల వారి చరిత్ర బౌద్ధంలో పద్మసంభవుని చరిత్ర, యిస్లాంలో అబ్దుల్ ఖాదర్ జిలాని వారి చరిత్రలను ఎంతో సన్నిహితంగా పోలివుంటుంది. అందుకని సకల సాధు స్వరూపుడయిన దత్తస్వామిగా సాయిబాబాను కొలుచుకుంటారు. దత్తజయంతి సందర్భంగా ఆ రోజుకు ముగిసేలాగ దత్తావతారాల చరిత్రమైన శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిబాబాచరిత్ర పారాయణ చేస్తారు. సాయిని విశేషంగా పూజించుకుంటారు. దగ్గరలో సాయిబాబా మందిరముగాని, సత్సంగ కేంద్రముగానీ వుంటే సామూహిక పూజలు, జపధ్యానాదులు, చరిత్ర శ్రవణము 9 రోజుల పాటు (దత్త నవరాత్రులు) చేసుకుంటారు. దత్తజయంతి రోజున సాయిని విశేషంగా స్మరించుకుంటారు.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 27 డిసెంబరు 2009 సంచిక: 8

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి





<u>చందా వివరములు</u>

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |
| (సంగలోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును) | |
| (20 సంగలపాటు మీకు పత్రిక పంపబడుతుంది) | |
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |


<u>చిరునామా</u>

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, మంగమూరు డొంక, ఒంగోలు-2.**

**ఫోన్ నెం: 08592 - 233271**

Website: www.saibharadwaja.org


www.saimasterforums.org

# విషయసూచిక:


| | | |
|---|---|---|
| 1. | శ్రీ దత్తజయంతి | 1 |
| 2. | భగవాన్ రమణమహర్షి | 3 |
| 3. | భగవంతుని ఆనందతాండవమే యీ సృష్టి | 5 |
| 4. | సాధన, సాధ్యమూ సద్గురువే! | 7 |
| 5. | వార్తాలాపము - సీరియల్ | 8 |
| 6. | హృదయంలో జ్ఞానదీపం వెలిగించుకోవాలి! | 12 |
| 7. | శ్రీ భరద్వాజ లేఖామృతము | 14 |
| 8. | శ్రీ దత్తలీలామృతము | 16 |
| 9. | మాస్టర్‌గారు చెబుతున్నారు | 19 |
| 10. | క్రీస్తు చెప్పిన దేవరాజ్యము లభించేదెవరికి? | 21 |
| 11. | ఆ బాలుడు ఎవరు? | 23 |
| 12. | నీదే భారం | 24 |
| 13. | శ్రీ సాయి సచ్చరిత్ర | 25 |
| 14. | ఆంతరంగిక పారిశుధ్యము-ఆవశ్యకత | 28 |
| 15. | సూక్ష్మంలో మోక్షం | 30 |



## ధన్యవాదములు

ఈ సంచిక ముద్రణకు ఆర్థిక సహకారము అందించిన వారు:

1. శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్
2. www.saibharadwaja.org
3. Sai Master Forums Online సత్సంగ సభ్యులు

**వీరిని శ్రీ సాయి మాస్టర్ సదా అనుగ్రహించుగాక!**



సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్‌కు ఎటువంటి బాధ్యతా లేదు.

# భగవాన్ రమణమహర్షి

భగవాన్ జన్మదిన ప్రత్యేక వ్యాసం

శిష్యుడు : మహర్షి గురువవసరంలేదనంటారని కొందరూ, అవసరమని చెబుతారనికొందరూ అంటారు. ఏది సత్యం ?

భగవాన్: గురువనావశ్యకమని నేనెన్నడూ అనలేదు.

శి : తరచుగా అరవిందులు మీకు గురువులేరని చెబుతారే?

భ : అది గురువంటే నీకున్నభావంపై ఆధారపడుతుంది. ఆయన మానవాకృతిలోనే ఉండనవసరం లేదు. దత్తాత్రేయులవారికి యిరవై నలుగురు గురువులు–పంచభూతాలూ మొదలైనవి – అంటే సృష్టిలోని యేరూపమైనా–వారికి గురువేనన్న మాట. గురువత్యావశ్యకం. గురువుతప్ప మరెవ్వరూ యింద్రియ మనోవిషయాలనే అడవిలో నుంచి బయటకు నడిపించలేరని ఉపనిషత్తులు కూడ చెబుతాయి. కనుక గురువుండితీరాలి.

శి : మహర్షికి మానవాకారంలో గురువులేరుకదాయని నా భావం.

భ : నాకూ యెప్పుడో ఒకప్పుడు గురువుండి వుండవచ్చు. నేను అరుణాచలేశ్వరుని స్తుతించలేదా! గురువంటే యేమిటి? గురువంటే భగవంతుడు లేక ఆత్మే. మొదట మానవుడు కోరికలు తీర్చమని భగవంతుని ప్రార్థిస్తాడు. తరువాత కొంతకాలానికి దైవాన్ని దైవంకోసమే ప్రార్థిస్తాడు. అప్పుడు మానవాకారంలోగాని, మరొక రూపంలోగానీ అతని ప్రార్థననుసరించి గురువుగా భగవంతుడే దర్శనమిస్తాడు.

భ : ఎల్లప్పుడూ ఆత్మనిష్ఠుడై యుండేవాడే గురువు. అతడెప్పుడూ తనకూ యితరులకూ మధ్య భేదాన్ని చూడడు. తాను ముక్తుడననీ, జ్ఞానిననీ, తక్కినవారు అజ్ఞానాంధకారంలో బద్ధులైనవారనీ తలచడు. యెట్టి పరిస్థితిలోనూ అతని స్థైర్యం చెదరదు.

శి : ఉపదేశత్త్వమెలాంటిది ?

భ : ఉపదేశమంటే ఒక వస్తువును దాని స్వస్థానానికి చేర్చడమని అర్థం. శిష్యుని మనస్సు శుద్ధము, సచ్చిదానందము అని చెప్పబడు సహజస్థితినుండి చలించి యోచనల రూపంలో యింద్రియ విషయాలను నిరంతరమూ అనుసరిస్తుంది. అందువలన అది జీవితంలో దుఃఖాలకూ, చింతలకూ గురియై బలహీనమై వికలమౌతుంది. గురువు దీనికి సహజస్థితి నందించి ఆ స్థితినుండి జారనివ్వక అట్లే నిలపడమే ఉపదేశము. అట్టి సహజమైన ఆత్మస్థితే గురువు యొక్క నిజరూపము. దూరమున ఉన్న దానిని దగ్గరగాజూపుటే ఉపదేశమనిగూడ చెప్పవచ్చు. అంటే శిష్యుడు తనకంటే భిన్నమనీ, తనకు సుదూరమనీ తలచిన దైవము (లేక ఆత్మ) ప్రత్యక్షమనీ, శిష్యునియొక్క నిజతత్త్వమని గురువు దర్శింపజేయడమే ఉపదేశము.

శి : గురువు యొక్క నిజతత్త్వము శిష్యుని యొక్క నిజతత్త్వమేయైతే సాధకుడు అన్ని సిద్ధులనూ సాధించినప్పటికీ గురుకృపలేక అతడికాత్మజ్ఞానం కలగజాలదని ఖండితంగా శాస్త్రాలెందుకు చెబుతున్నాయి?

భ : గురుతత్త్వం శిష్యుని నిజతత్వమేనన్నది వాస్తవమే కాని గురుకృపలేక ఆత్మజ్ఞానం కలగడం అసంభవం.

శి : గురుకృప అంటే ఏమిటి ?

భ : గురువే ఆత్మ. ఎప్పుడో ఒకప్పుడు మానవుడు జీవితంలో అసంతృప్తిచెంది తనకున్న దానితో తృప్తి చెందక దైవప్రార్థన ద్వారా కోరికలు నెరవేర్చుకోజూస్తారు. ప్రార్థనవలన క్రమంగా అతడి మనస్సు శుద్ధమైన కోరికలను తీర్చు కోవడం అప్రధానమై కృప పొందడమే ముఖ్యమౌతుంది. అప్పుడు దైవకృప ప్రకటం కానారంభిస్తుంది. దైవమే గురు రూపంలో దర్శనమిచ్చి, సత్యాన్ని బోధించి, తన సాంగత్యంతో అతడి మనస్సును

పరిశుద్ధం చేస్తాడు. అలా భక్తుని మనస్సు శక్తిని పొంది అంతర్ముఖం కాగలగుతుంది. ధ్యానం వలన మరింత శుద్ధమై నిశ్చలమౌతుంది. ఆ నిశ్చలతే ఆత్మ.

గురువు బాహ్యమూ, ఆంతరంగికమూ కూడ. బయటనండి అంతర్ముఖం చేసి లోపల నుండి దానిని ఆత్మ వైపుకులాగి దానిని శాంతపరుస్తాడు గురువు. అదే గురుకృప. దైవము, గురువు, ఆత్మ వేరుకాదు. నీవు అన్యమనీ, దేహమనీ తలచినంతకాలం బాహ్యమైన గురువు ఆవశ్యకం. ఆయన గూడ దేహంతోనే దర్శనమిస్తాడు. దేహమే నేననే భ్రాంతి నీకు తొలగగనే ఆయనే ఆత్మయని గుర్తిస్తావు.

శిష్యుడు గురువాజ్ఞననుసరించి ఆంతరంగికమైన సాధన చేయాలి. గురువే లోపలా బయటానున్నారు. నిన్నంతర్ముఖుని చేయటానికి అవసరమైన పరిస్థితులను కల్పిస్తూ నీ ఆంతర్యాన్ని ఆత్మకేంద్రంలోకి లాగడానికి సంసిద్ధం చేస్తారు.

అహంకారం యేనుగువంటిది. సింహముతప్ప దానినింకొక్కటి లొంగదీయలేదు. అట్టి సింహమే యీ గురువు. ఆయన యేనుగువంటి అహాన్ని భయంతో వణికి మరణించేలా చేయగలడు. నీలోని అహం నశించడమే నిజమైన ప్రతిభయని నీవపుడు గుర్తిస్తావు. అట్టి స్థితి రావాలంటే గురువు కాత్మసమర్పణచేయాలి. అప్పుడేనీవు ఆత్మోపదేశానికర్హుడవని గుర్తించి గురువనుగ్రహిస్తాడు.

ఆత్మజ్ఞానం పొందదలచినవాడికి గురువు ఆవశ్యకం. గురువే నిజమైన ఆత్మయని, నీవు భ్రాంతి మాత్రమైన వ్యక్తిత్వమేననీ తలంచు. ఆరెంటికీ భేదం నశించడమే అజ్ఞాన నివృత్తి. నీలో దైవత్వభావమున్నంతవరకూ గురువు ఆవశ్యకం. నీ శరీరమే నీవని తలుస్తావు గనుక గురువుకూడ మరొక శరీరమేనని తలుస్తావు. నీవూ, గురువూ కూడ దేహం కాదు. నీవు ఆత్మవు, గురువూ అంతే. దేహాన్ని చూచి గురువని భ్రమిస్తావు. కాని గురువలా భ్రమించడు. నీలో గూడా నున్న నిరాకారమైన ఆత్మే గురువు. నీకీసత్యాన్ని తెలియజేయడం కోసమే ఆయన బాహ్యంగా దర్శనమిస్తాడు. ఆయన శిష్యులకు బోధించినాగూడ తననుతాను గురువని తలచడు. 'గురువు–శిష్యుడు' అనేవి మాయకు చెందిన వ్యవహారమేనని ఆయనకు తెలుసు.

దైవము, అనుగ్రహము, గురువు అన్నవి పర్యాయపదాలు. అవి శాశ్వతము, సర్వగతము అయిన సత్యాన్నే సూచిస్తాయి. ఆత్మ యెప్పుడూ మనలోనే ఉందికదా! గురువు తన కృపాదృష్టి ద్వారా మనకు ప్రసాదించవలసినదికాదు. తానే గురువునని తలచేవాడు ఆ పేరుకు అర్హుడు కాడు. గురువు ప్రశాంతుడయ్యుంటే అందరిలోనూ శాంతి ఆవహిస్తుంది. రాక్షసి బొగ్గుకంటే చింతబొగ్గూ, దానికంటే తుపాకిమందు త్వరితంగా అంటుకున్నట్లే ఒకే మహాత్ముని ఆశ్రయించిన అనేకులు వేర్వేరు ఫలితాలను పొందుతారు.

శి : సమర్థుడైన గురువును గుర్తించేదెలా?

భ : ఆయన సన్నిధిలో మీకు లభించే మనశ్శాంతిని బట్టీ, ఆయన పట్ల మీకు సహజంగా కలిగే గౌరవాన్ని బట్టి గుర్తించవచ్చు.

శి : గురువుతోటి సాంగత్యం వారి మహాసమాధి అనంతరం కూడా కొనసాగుతుందా?

భ : గురువంటే భౌతికదేహంకాదు కనుక ఆరూపమదృశ్యమయ్యాక గూడా వారితోగల సంబంధం కొన సాగుతుంది. **పులినోటచిక్కిన వేటువలే గురుకృపను పొందిన వాడు యెన్నటికీ విడువబడక నిస్సంశయముగా రక్షింపబడుతాడు.**

కూర్పు :- ఎక్కిరాల విక్రమాదిత్య.

# భగవంతుని ఆనందతాండవమే యీ సృష్టి

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

"భగవంతుని ఆనంద తాండవమే యీ సృష్టి"యనీ, దీనిని గుర్తుంచుకొని, దీనితో సామరస్యంచెంది జీవించే జీవనకళయే సార్థకమైన అయిహిక జీవితమనీ, అప్పుడనుభవమయ్యే ఆనందమే జీవితపరమార్థమనీ అన్నాము. అలాటి జీవనకళకంతటికీ పునాది వంటిది బ్రహ్మచర్యమనే ప్రథమ ఆశ్రమం. మిగిలిన మూడు ఆశ్రమాలలో తగిన రీతిన జీవించడానికవసరమైన పరిజ్ఞానాన్ని, దానిననుసరించిన జీవితవిధానాన్ని అలవరచుకోవడమే యీ మొదటి ఆశ్రమ ధర్మం. అందుకే బ్రహ్మచర్యంలో, సమర్థుడైన ఆచార్యుని చెంతన, తగిన వయస్సురాగానే పిల్లలను వప్ప చెప్పేవారు - యీనాడు మనం పిల్లలను పబ్లిక్ స్కూళ్ళలో చేరుస్తున్నట్లు! పుస్తకజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, సంస్కారము, శీలమూ అలవడాలన్న ఆశతోనే గదా పిల్లలను పబ్లిక్ స్కూళ్ళలో జేరుస్తున్నాము? కానీ ఎక్కువ భాగం పబ్లిక్ స్కూళ్ళలో మిథ్యాసంస్కారమే వచ్చే అవకాశముంటున్నది.

ఎటువంటి స్కూళ్ళలో వేసినా పిల్లలందరికీ ఎందుకు ఉత్తమ సంస్కృతి అలవడదో గమనిద్దాము. ఎంతగానో పురోగమించిన మనస్తత్వ శాస్త్రం ప్రకారం పిల్లలను మనం పబ్లిక్ స్కూళ్ళకు పంపే వయసులోపలే వారి భావిజీవితాలకు వలసిన పునాదులు వారి హృదయాలలో ఏర్పడతాయి. మూడు నుండి 5వ సం॥ వచ్చే నాటికే పిల్లవాడి మనస్తత్త్వం ఒక ధృఢమైన రూపం ధరిస్తుంది. కాకుంటే పెద్దలంటే భయంవలన వారు దానిని వెల్లడి చేయరు. కాని పెద్దలు అజ్ఞానంతో వారిని పెంచిన ఫలితాలన్నీ పిల్లలు పెద్దవారయ్యాక భయటబడి అటు పెద్దలకు, యిటు పిల్లలకూ గూడ జీవితం కంటకంగా తయారై తీరుతుందని మనస్తత్త్వ శస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ వ్రాసిన Civilization and Its Discontents (నాగరికత - దానిలోని అసంతృప్తులు) అనే గ్రంథం చూస్తే తెలుస్తుంది. కనుక పిల్లలను పెంచడంలో పెద్దలెంతో పరిజ్ఞానంతో వ్యవహరిస్తేగాని తర్వాత ఏలాంటి స్కూళ్ళలో వేసినా అంత ప్రయోజనముండదు.

పిల్లలనెలా పెంచాలో తెలిపే సూచనలు కొన్ని మనకు సాయిబాబా జీవిత చరిత్రలో కనబడతాయి. ఉదాహరణకు మసీదులో తమను పూజిస్తున్న ఒక యిల్లాలితో సాయి, "నీవిప్పుడు పూజ ఆపి వెంటనే యింటికి వెళ్ళు" అని శాసించారు. ఆమె యింటికి వెళ్ళేసరికి పసిబిడ్డ ఆకలై పాలకోసం గుక్క పెట్టి ఏడుస్తూన్నది. బిడ్డకు పాలిచ్చి, ఆడించి, నిద్రపుచ్చి తిరిగి ఆమె మసీదుకు రాగానే, "ఇప్పుడు నీపూజ ముగించుకో!" అన్నారు సాయి. దీని వెనుక ఎంత గొప్ప సత్యం దాగియున్నదో తెలియాలంటే సద్గురు పూజకంటే గూడ పసి బిడ్డలను తృప్తిపరచడమెంతో ముఖ్యమని సాయి సూచించడం గమనించాలి. దీనిని గురించి ఆలోచిద్దాము.

ఒక మానసిక వైద్యుని (సైఖ్యాటరిస్టు) వద్దకొక మధ్య వయస్కుడైన వ్యక్తి చికిత్సకోసమొచ్చాడు. ఎన్ని వృత్తులు మార్చినా, ఎందులోనూ తనకు తృప్తి కల్గడం లేదనీ, తానెవ్వరినీ హృదయపూర్వకంగా ప్రేమించలేకున్నాననీ, ఎవరి ప్రేమనూ అర్థంచేసుకొని పొందలేకున్నాననీ, చివరికి దాంపత్యంలోకూడ తనకు సుఖం లోపించిందనీ, కనుక జీవితం వ్యర్థము, నిస్సారమూ అనిపిస్తున్నదనీ ఆ వ్యక్తి వాపోయాడు. ఆ మానసిక వైద్యుడు ఆ వ్యక్తి యొక్క మనస్తత్వాన్ని చాలాకాలం పరిశోధించి, చివరకు అండు కారణాన్ని కనుగొన్నాడు : ఆ వ్యక్తి తల్లి ఉద్యోగానికి వెళ్ళడంవలన అతణ్ని సంవత్సరంలోగానే తల్లిపాలు మాన్పించింది. ఇదేనట అతడి ప్రౌఢ జీవితంలోని తీరని వెలితికంతటికీ కారణం! అతడు తల్లి, తండ్రీ, భార్యాబిడ్డల దగ్గర నుండీ ఎవరినీ ప్రేమించలేకపోవడానికి!!

సామాజిక ధర్మానికి కట్టుబడి బలవంతంగా తన బాధ్యతలు నిర్వర్తించడం ప్రేమ లేనపుడెంత సంకటంగా వుంటుందో! అలా అయిష్టంగా చిరకాలం వత్తిడికిలోనై జీవించడం ఆ వ్యక్తియొక్క మానసిక, శారీరక ఆరోగ్యానికి గూడ ఎంతో ప్రమాదకరం. అతణ్ణి ఏ రీతినైనా సంతృప్తిగా వుంచాలని అతడి భార్యా, బిడ్డలు, తల్లిదండ్రులూ ఎంత తాపత్రయపడినా వారిప్రేమ అతనికర్థంకాకపోగా, ఒక పెద్ద బాధగా తయారవడం వారందరికీ ఎంతటి చిత్రహింస!

ఈ మూల కారణాన్ని మనస్తత్త్వవేత్త, డా॥ లోనెన్ యిలా వివరించారు - బిడ్డ గర్భం నుండి వెలువడగానే ఒకవంక ప్రసవమనే తీవ్రమైన శారీరకమైన ఒత్తిడికి గురిగావడమేగాక, తనకు వీసమెత్తుగూడ పరిచయంలేని ఏదో ప్రపంచంలోకి ప్రవేశిస్తాడు. ఆ పరిస్థితి అతడికెంతో అయోమయంగాను, ఆందోళనకరంగానూ వుంటుంది. ఆ స్థితిలో తల్లి పొత్తిళ్ళలో వుంటే అతడికి కొంత ఉపశాంతి, ధైర్య స్థయిర్యాలూ కలుగుతాయి. స్పర్శద్వారా ప్రేమ ఎంతగా వ్యక్తం కాగలదో మనందరికీ అనుభవమే. నోరులేని జంతువులు గూడ ప్రేమను స్పర్శతోనే గమనిస్తాయి, అందిస్తాయి. ఆ బిడ్డకు సుమారు 3వ సం॥ వచ్చి, మొదట నడక బాగా వచ్చేదాకా ప్రపంచం సుపరిచితం కాదు. అంతవరకూ సన్నిహితము, ప్రేమపూర్వకమూ అయిన తల్లి స్పర్శ బిడ్డకు ఆహారంకంటే గూడ ఎక్కువ అవసరం. అది లోపించినపుడు బిడ్డ ఎంతో ఆందోళనకూ, భయానికీ గురియౌతాడు. అందుకని తల్లియొక్క లాలనకోసం శాయశక్తులా ఏడుస్తాడు. అది అందకపోతే ఒకానొక అసంతృప్తి, నైరాశ్యమూ, ఆందోళన అతడి హృదయంలో నాటుకుపోతాయి. భావి జీవితాన్నంతటినీ తారు మారు చేస్తాయి.

తల్లి చెంతను తృప్తిగా అనుభవించిన బిడ్డ నేర్చే మొదటి భావం ప్రేమ. తల్లి ద్వారా అసలు ప్రేమ అనే హృదయ భాష అతడు నేరుస్తాడు. అది నేర్చిన కొద్దీ అతడూ ఆమెను ప్రేమిస్తాడు. తద్వారా సాటివారిని ప్రేమించడానికవసరమైన పునాదులు అతడి హృదయంలో పడతాయి. తల్లిపాలు తనివి తీరా త్రాగిన బిడ్డ ప్రేమతోగూడిన పోషణ పొందుతాడు. లేకపోతే ప్రేమలేని మేత మేస్తాడు. ఆ పసిబిడ్డ దృష్టిలో యీ ప్రపంచానికీ, మానవాళికీ ప్రతినిధి తన తల్లి. ఆమెనెంతగా ప్రేమిస్తాడో, ఆమె ప్రేమనెంతగా అర్థం చేసుకొంటాడో అంతమేరకే భావిజీవితంలో తానితరులను ప్రేమించగల్గుతాడు; వారి ప్రేమనర్థం చేసుకుంటాడు. కనుకనే బిడ్డకు మూడవ సంవత్సరం వచ్చేంతవరకూ తల్లి పాలిచ్చే ఆదిమ జాతులలో ఎంతో గాఢమైన ప్రేమాభిమానాలుంటాయని డా॥ లోవెన్ అంటాడు. సాయి ఆ తల్లిని శాసించినదానిలో యింతటి సత్యం దాగియున్నది!

'అయితే సాయిబాబాకు యింత ఆధునికమైన మనస్తత్వ శాస్త్రం తెలుసంటారా?' అన్న సంశయం కల్గవచ్చు. నిజానికిట్టి జ్ఞానం సహజంగానే కల్గుతుంది. ఆధునిక భ్రాంతులచేత కలుషితంగాని ఏ తల్లికైనా బిడ్డను త్వరగా పాలు మాన్పించడం ఎంతో హృదయవేదనను కల్గిస్తుంది. ఆధునికంగా కాలుష్యం చెందని ఏ తండ్రికైనా తన భార్య పొత్తిళ్ళలో హాయినిపొందే బిడ్డను చూస్తే యీ సత్యం హృదయంలో గోచరిస్తుంది. ఆదిమ జాతివారికి ఆధునిక మనస్తత్వశాస్త్రం తెలుసా? పశువులకు తెలుసా? తెలుసు. మానవుడే తన దుష్టమైన మిధ్యాజ్ఞానంతో మధ్యలో కొంతకాలం యీ అవగాహన కోల్పోయి, అదే విజ్ఞానమని తలచి, సహజమైన జీవిత విధానాన్ని తారుమారు చేసుకొని, మళ్ళీ యినాడు పురోభివృద్ధి చెందిన జ్ఞానంతో తన తప్పును గ్రహించి సరిదిద్దుకొంటున్నాడని గుర్తిస్తే యీ ప్రశ్న ఉత్పన్నం కాదు.

# సాధన, సాధ్యమూ సద్గురువే!

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

దైవాన్ని ఆరాధించడమంటే - దైవం అనే పరమార్థం వైపుకు - దైవంగా మనల్ని మనం రూపుదిద్దుకోవడమే! పరిణామం చెందించుకోవడమే! అలా కాని మనం పగ, ద్వేషము, క్రోధము, అసూయ, స్వార్థము, మమకారము, పక్షపాతబుద్ధి, అవివేకములకు బానిసలమై, వీటన్నిటికీ మూలమైన 'నేను వేరు, జగత్తు వేరు' అనే భావనకు బానిసలమై అవినీతిపరులుగా తయారై మనకు మనమూ, తద్వారా సమాజానికీ ద్రోహం చేస్తూ సామాజిక అశాంతికి కారకులమవుతాము.

దైవాన్ని ఆరాధించే ప్రయత్నంలో మన జీవిత విధానంలో మార్పులు రాగల అవకాశాలు ఎన్నో! దైవంగా పరిణామం చెందాలంటే దైవీ సంపత్తిని అలవరచుకోవడం తప్పనిసరి. అంటే పగ, ద్వేషమూ, క్రోధమూ విడచి-కరుణ, ప్రేమ, ఓరిమీ అలవరచుకుంటామన్నమాట. ఇతరుల ఉన్నతిని చూచి అసూయ పడే బదులు త్యాగభావాన్ని అలవరచుకుంటామన్న మాట! సర్వత్రా, సకల జీవులలోనూ దైవమున్నాడనే విషయాన్ని గుర్తించుకొనే ప్రయత్నంలో ఒకరు తక్కువనీ, మరొకరు అధికులనే భావాలను విడనాడుతామన్నమాట.

ఇట్టి సద్గుణాలను పొందాలంటే ఏం చేయాలి? నిరంతరం మనం దేన్నైతే భావనచేస్తూ వుంటామో అట్టి గుణాలనే పొందుతామని మహాత్ములు చెపుతారు. వెలగని దీపాన్ని వెలిగించాలంటే వెలుగుతున్న మరొక దీపం దగ్గరకు దాన్ని చేరిస్తే సరిపోతుంది.

దైవీసంపత్తియైన ఇట్టి సద్గుణజ్యోతులే ఆత్మజ్ఞానాన్ని సాధించిన మహాత్ములంతా. అట్టి వారిని నిరంతరం గుర్తుంచుకుంటూవుంటే వారిలోని సద్గుణాలన్నీ మనలోనూ చోటు చేసుకుంటాయి. అలాంటి మహనీయులను గుర్తుంచుకోవడాన్నే సత్సంగము అంటారు. 'సత్' అంటే కేవలం దైవమే! సత్సంగం అంటే దైవ సన్నిధి-దైవీ సంపత్తి గలవారి సాంగత్యము అన్నమాట - అంటే మహాత్ముల సన్నిధి అని అర్థం. ఎవరు సిసలైన మహాత్ములో, ఎవరుకారో, ఏది సత్సంగమో ఏది కాదో తేల్చుకోలేని నేటి రోజుల్లో సాటిలేని మహాత్ముడుగా అవతరించారు సాయి. విశ్వ స్వరూపిగా, కరుణామయుడుగా ప్రకటమై నిరూపించుకున్న సాయిని విరామసమయమంతా స్మరించుకుంటే అంతకంటే సత్సంగం మరొకటి లేదు. సద్గుణరాశియైన సాయిని నిరంతరం గుర్తుంచుకోవడానికి మొదట ఆయన చరిత్ర పారాయణ చేసుకుంటారు. తద్వారా ఆయన ఔన్నత్యం హృదయంలో నాటుకుని ఆయనపట్ల ఎనలేని భక్తివిశ్వాసాలు కలుగుతాయి. విరామ సమయంలో ఆయన గురించి పలువురికి చెప్పడం, ఆయనవైపు మనను మళ్ళించుకోవడానికి ఎంతో ఉపయోగం. గురువారాలు ఏదో ఒక ఆవరణలో సాయి చిత్రపటం పెట్టి ఆయన చరిత్రను (పెద్దగా) చదివి, సామూహికంగా శ్రవణం చేసి, కాసేపు భజన చేసుకుంటే వినే వారికి సాయి ఔన్నత్యం తెలుస్తుంది. వారి హృదయాలలోనూ సాయి ప్రవేశిస్తారు.

అంతేగాక, సాయిని ఆరాధించే ప్రయత్నంలో ఆయన సూక్తులకు విరుద్ధంగా లేకుండా చూచుకుంటారు. సాయి ఆయన సూక్తులద్వారా, ఆచరణద్వారా, మననూ, సమాజాన్ని అశాంతి పాలుచేసే దుర్గుణాలను వీడడం ఎలాగో బోధించారు.

సాయి, "అసూయను జయించడం చాల సులువు. ఈ వికారం వలన మన కెలాటి లాభమూ లేదు. అవతలవారి కేలాటి నష్టమూలేదు. అసూయ అంటే అవతలవారి బాగును సహించలేపోవడమే. ఓర్వలేక అపవాదులు కల్పిస్తాము. వాడు నష్టపోతే సంతోషిస్తాము. ఇదేమి మంచి? అవతలివాడికి మంచి జరగడంవల్ల మనకేమి నష్టం జరిగింది? కానీ ఎవరూ ఈ సంగతి ఆలోచించరు. వాళ్ళు బాగుపడితే మనకే మేలు జరిగినట్లు భావిద్దాం! లేదా మనమూ ఆ మేలును పొందే యత్నం చేద్దాం. వాడు మన సొత్తేమి లాక్కున్నాడు?" అన్నారు.

ఇలాంటి సాయి సూక్తులను మననం చేసుకుని ఆచరిస్తే వ్యక్తులకూ, వ్యక్తులకూ మధ్య వచ్చే ఎన్నో కలతలకు, తద్వారా మానసిక వేదనలకూ, ఆవేశాలకూ తావుండదు. ఎప్పటికప్పుడు మన ఆచరణను సాయి చెప్పిన మార్గానికి మళ్ళించుకుంటూ, ఆయన చెప్పిన మార్గాన పయనించడానికి కృతనిశ్చయులమవుదాం!

జై సాయి!

## మహాత్ముల హృదయము

స్వా.ప్ర.:- స్వామివారి హృదయము కోమలమయినదే. అంతియే కాదు. కఠోరమయినదికూడాను. మహాత్ముల హృదయములు అట్లే ఉండును. చాకలియొక్క నిందావాక్యములను వినినతోడనే శ్రీరామచంద్రుడు సీతను అడవిలోనికి పంపెను. అంతట జనులకు సీతను మరల రాజ్యములోనికి తీసికొనవచ్చుట యుక్తమని తోచెను. వారు రాముని అశ్వమేధయాగము చేయమని ప్రార్థించిరి. భార్యలేనిదే ఆ యజ్ఞము చేయబడదు. యజ్ఞముచేయనిశ్చయించినచో సీతను పిలిపించనైన పిలిపించవలెను. లేదా మరియొక వివాహమైనను చేసికొనవలెను. రామచంద్రుడు యజ్ఞము చేయుటకు అంగీకరించెను.

ఈ సంగతి వాల్మీకిమహర్షికి తెలిసెను. "రాముడు అశ్వమేధము చేయును. అందుకు మరియొక వివాహము చేసికొనును. ఇది చాల దుఃఖించవలసిన సంగతి" అని ఆయన సీతతో చెప్పెను. కాని ఆమె నమ్మలేదు. "నా అంతరాత్మ విశ్వసించుట లేదు. ఆయన చేసికొనరు" అనెను. అశ్వమేధమును ఆరంభించు తరుణమున వశిష్ఠుడు చెప్పెను, "సీతనైన పిలిపింపుము, లేదా మరియొక వివాహమునైన చేసికొనుము. లేనిచో యజ్ఞముచేయుటకు వీలుపడదు". రాముడు పలికెను. "రెండవ పెండ్లి చేసికొనినచో ఏకపత్నీవ్రతమునకు భంగము కలుగును. సీతను పిలువనంపినచో జనులు నవ్వెదరు. స్వర్ణసీతను చేయించి యజ్ఞమును చేసెదను." ఈ మాటలు వాల్మీకికి తెలిసి సీతతో పలికెను. "ఎంతయో సంతోషము. రాముడు రెండవ పెండ్లి చేసికొనుట లేదు. స్వర్ణసీతతో యజ్ఞముచేయుటకు నిశ్చయించుకొనెను." ఈ విషయమున చెప్పబడినది,

వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి।
లోకోత్తరాణాం చేతాంసి కో హి విజ్ఞాతుమర్హసి ॥

"ఉత్తమచిత్తముకల మహాత్ముల హృదయములు వజ్రము కంటే కఠినముగా నుండును. పుష్పము కంటె కోమలముగా నుండును, వానిని తెలిసికొన సమర్థుడు ఎవరు?"

చాకలిమాటలు విని సీతను విడచివేయు కాఠిన్యమును ఆ హృదయము పొందియుండెను. రెండవపెండ్లి చేసికొనినచో సీత దుఃఖించునను భావముతో స్వర్ణసీతను చేయించి సీతను బాధించలేదు. ఆయన హృదయము అంత కోమలమయినది. ఇట్లే స్వామివారి హృదయము దీనులను చూచి కరిగిపోవును. కాని వైరాగ్యమును పాలించుటలో ఎంత కఠోరమో చెప్పలేము. అటు తరువాత శ్రీ నిత్యానందులు మొదలగువారు పీఠడియా బయలుదేరిరి.

## ఇరువది రెండవ ప్రసంగము

ఆరోజులలో శ్రీ ప్రకాశానందస్వామివారు గోండాలులో నుండిరి. అక్కడ స్వామివారిని దర్శించుటకు రాజకోటనుండి మోహన్‌భాయి, శాస్త్రి రేవాశంకర్ భాయి మొదలగువారు వచ్చిరి. చందుభాయి కూడ సమీపముననే కూర్చొనియుండిరి. ఆ సమయమున పీఠడియా ప్రసంగము వచ్చెను. చందుభాయి శ్రీ నిత్యానందస్వామి వారిని దర్శించవలెనను కుతూహలమును వ్యక్తపరచెను. అంతట అందరునూ శ్రీ ప్రకాశానందులవారిని కూడ తీసికొని పీఠడియా వెళ్ళిరి. శ్రీ నిత్యానందులవారి కోరిక ప్రకారము శ్రీ ప్రకాశానంద

స్వామివారు అందరినీ పరిచయము చేసిరి. శాస్త్రిగారిని గురించి ఇట్లు పలికిరి. "శాస్త్రిగారు మహావిద్వాంసులు. రాజకోటయందలి రాజకుమార కళాశాలలో ఉద్యోగము చేసిరి. ప్రస్తుతము సంస్కృతకళాశాలలో అధ్యాపకులు." శాస్త్రిగారు చెప్పిరి. "నాకు నైష్ఠికబ్రహ్మచర్యమున కాలము గడపవలెనని కోరికయుండెడిది. ఆయుద్దేశ్యముతో నేను వారణాసికి వెళ్ళిపోతిని. మన దేశమునకు తిరిగి రాలేదు. కాని నా సోదరి కాశీకివచ్చి గృహస్థాశ్రమమును తీసికొనమని చాల పట్టుపట్టినది. ఆమె నన్ను ఇంటికి తీసికొనివచ్చినది. శ్రీప్రకాశానంద స్వామివారు కూడా నా సోదరి చెప్పిన మీదట గృహస్థాశ్రమమునకు నన్ను ప్రోత్సహించిరి. అంతట నేను స్వామి వారిని ప్రశ్నించితిని. "తమరు నన్ను గృహస్థాశ్రమమునకు తొందరచేయుచున్నారుకదా! తమరు గృహస్థాశ్రమమును తీసికొనకుండ సన్యసించుటకు కారణమేమి?"

## శ్రీప్రకాశానందస్వామివారి వినోదము

స్వా.ప్ర.:- అదే నేను సన్యసించి చింతించుచున్నాను. నేను డబ్బు పుచ్చుకొనకూడదు. అడిగికొనిన మధుకరము దొరకదు. దగ్గర డబ్బులేదు. బట్టలు లేవు. చలిలో ఉండవలసి వచ్చుచున్నది. హృషీ కేశమున జబ్బుపడినప్పుడు చాల బాధపడితిని. నా పరిస్థితి కుక్క పరిస్థితితో సమానముగా నుండెను. పూర్తిగా వైరాగ్యము కలిగిననే సన్యసించుము.

విరక్తః ప్రవ్రజేద్ధీమా సరక్తస్తు గృహే వసేత్।
సరక్తో నరకం యాతి ప్రవ్రజన్ హి ద్విజాధమః ॥

"బుద్ధిమంతుడగు ద్విజుడు వైరాగ్యము పొందినమీదటనే సన్యసించవలెను. సంసారమునందు రాగము వున్నచో గృహస్థాశ్రమమునందు వుండుటయే మంచిది. రాగము కలవాడు సన్యసించినచో ఆ అధమునకు నరకము కలుగును." కావుననే నేను శాస్త్రిగారికి గృహస్థాశ్రమమును స్వీకరించుడని సలహా చెప్పితిని.

శాస్త్రి :- శ్రీ ప్రకాశానందస్వామివారు ఆ విధముగా తెలియజెప్పినమీదట నేను గృహస్థాశ్రమమును స్వీకరించితిని. ఇప్పుడు మొహంమొత్తినది. పిల్లలను పెంచుటకొరకు ఈ జంజాటములో పడవలసి వచ్చుచున్నది.

స్వా.ప్ర :- గృహస్థాశ్రమమును స్వీకరించుటలో తప్పు ఏమియు లేదు. గృహస్థాశ్రమమునందు వుండియే పురుషార్థమును సిద్ధింపజేసికొనవలెనని జరుగగలదు. కోటయందు ఉండి పోట్లాడుటచే రక్షణ ఉండునుకదా! మైదానములోనికి వచ్చి యుద్ధముచేయుట విపత్కరము. అటులనే గృహస్థాశ్రమమున ఉండి జ్ఞానమును సంపాదించుటయందు రక్షణ యుండును.

## గృహస్థాశ్రమ ప్రాధాన్యము

వేదములు, ఉపనిషత్తులు, స్మృతులు, ధర్మశాస్త్రములు అన్నియు గృహస్థాశ్రమముయొక్క ఉపయోగమును తెలిపినవి. తైత్తిరీయ శిక్షయందు ఆచార్యుడు శిష్యునకు ఉపదేశించాడు.

"ఆచార్యాయ ప్రియం ధనమహృత్య ప్రజాతస్తుం మా వ్యవచ్ఛేత్సీః"

"అచార్యునకు గురుదక్షిణగా కోరిన ధనము నిచ్చి, సంతోషపరచి, వారి ఆజ్ఞానుసారము గృహస్థాశ్రమమును తీసికొనవలెను. అంతేకాని నైష్ఠిక బ్రహ్మచారిగా గురుగృహమున ఉండి ప్రజాతంతువును ఉచ్ఛేదము చేయకుము."

మనుభగవానుడు గృహస్థాశ్రమమునందు మిక్కిలి విలువను కనపరచెను.

ఋణాని త్రీణ్యపాకృత్య మనో మోక్షే నివేశయేత్ ।
అనపాకృత్య మోక్షం తు సేవమానో వ్రజత్యధః ॥

"మూడు ఋణములను తీర్చినమీదట మనస్సును మోక్షమునందు నియోగించవలెను. ఆ ఋణములను దీర్చకుండ మోక్షమును సేవించువాడు అన్థఃపతితుడగును."

అనధీత్య ద్విజో వేదానముత్పాద్య తథాత్మజాన్ ।
అనిష్ట్వాచైవ యజ్ఞైశ్చ మోక్షమిచ్ఛన్ పతత్యధః ॥

"ప్రాణులన్నియును వాయువును ఆశ్రయించి జీవించును. అటులనే ఆశ్రమములన్నియు గృహస్థాశ్రమమును ఆశ్రయించి జీవించును."

యథా నదీనదాః సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్ ।
తథైవాశ్రమిణః సర్వే గృహస్థే యాన్తి సంస్థితిమ్ ॥

"నదులు, నదములు అన్నియును సముద్రములోనికి వెళ్ళి ఆగును. అటులనే అన్ని ఆశ్రమముల వారును గృహస్థాశ్రమమును ఆశ్రయించెదరు."

శ్రీమద్భాగవతమునకూడ కశ్యపుడు దితితో చెప్పెను :-

తస్యాః కామం న కః కుర్యాత్ సిద్ధిః త్రైవర్గికీ యతః ।
సర్వాశ్రమానువాసాయ స్వాశ్రవేణి కలత్రవా ।
వ్యవసనార్ణవమత్యేతి జలయానైర్వథార్ణవమ్ ॥

"భార్యసాహచర్యముచే ధర్మ, అర్థ, కామములను మూడు పురుషార్థములును సిద్ధించును. అట్టి భార్యను ఎవడు కోరడు?"

"అన్ని యాశ్రమములకు అండయగుటకు గృహస్థాశ్రమమున భార్యను చేబట్టి, నౌక సహాయమున సముద్రమును దాటునట్లు, దుఃఖసాగరమును దాటును."

యామాహురాత్మనో హ్యర్థం శ్రేయస్కామస్య మానిని ।
యస్యాం స్వధుర మధ్యస్య పుమాంశ్చరతి నిస్పృహః ॥

"ఓ సుందరీ! భార్య తన శరీరములో అర్ధభాగమని కళ్యాణమును కోరువాడు అనుకొనును. ఆమెయందు గృహభారమును ఉంచి పురుషుడు నిశ్చింతగా సంచరించును."

యామాశ్రిత్యేన్ద్రియారాతీన్ దుర్జయానితరాశ్రమైః ।
వయం జయేమ హేలాభిః దస్యూన్ దుర్గపతిర్యథా ॥

"కోటగల రాజు శత్రువులను తేలికగా జయించును. అటులనే బ్రహ్మచర్య సన్యాసాది ఇతర ఆశ్రమములద్వారా జయించలేని ఇంద్రియములనెడు శత్రువులను మనము ఒక భార్య సహకారముచే సులభముగా జయించెదము." అనగా గృహస్థాశ్రమమున భార్య కోటవంటిది. ఇంద్రియములను అదుపులో నుంచుకొనవలెనని ఆ ఆశ్రమమే కావలెను.

బృహదారణ్యకమునందలి పంచాగ్ని విద్యయందుకూడ చెప్పబడినది.

తద్యథా పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవన్తి ॥

ఈ విధముగా పంచమ ఆహుతియందు సహకరించిన అధికారి పురుషరూపమును పొందును. అచ్చటనే "యోషా వాగ్విర్గౌతము" "ఓ గౌతమ! స్త్రీ పంచమాగ్ని"అని చెప్పబడినది.

ఈవిధముగా స్త్రీని 5వ అగ్నిగా పరిగణించిరి. ఆశ్రమములలో కెల్ల గృహస్థాశ్రమమును అజేయమగు కోట అనియు, అన్ని ఆశ్రమములకును ఆధారమనియు వర్ణించిరి. జనకుడు, వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు వీరందరునూ గృహస్థాశ్రమమునందు ఉండియే ఉత్తమ జ్ఞానమును పొందిరి. ఇట్టి దృష్టాంతములు అనేకము కలవు. వివేకవైరాగ్యములు లేనిదే సన్యాసమును తీసికొని సన్యాసాశ్రమమును పాడుచేయు సన్యాసులకంటెనూ, లేక అట్టి నైష్ఠిక బ్రహ్మచారులకంటెనూ ఈగృహస్థాశ్రమములోనివారు ఎంతయో మంచివారు. కావున మీకు శ్రీ స్వామిప్రకాశానందులవారు గృహస్థాశ్రమమును తీసికొనమని చెప్పియున్నచో శాస్త్రదృష్టికి తగిన సలహాయే చెప్పిరి. అంతేకాక అధ్యయన, అధ్యాపనములు బ్రాహ్మణధర్మములు. ప్రాచీన కాలమున వేతనము తీసికొనకుండగనే ఆచార్యులు అధ్యాపనము చేసెడివారు. కానీ ఇప్పుడు అట్లు జరుగుటలేదు. అందుచే జీతము తీసికొనిననూ ఈ బ్రాహ్మణ వృత్తి ఉత్తమము. సరే, మరియొక ప్రవచనము నేదైనచేసెదరా? లేదా?

శాస్త్రి :- జనుల కోరిక ప్రకారము పంచనాథమునందు (శివాలయమునందు) గీతాదుల ప్రవచనము చేయుచుందును.

మహాభారతమునందు చెప్పబడినది కదా!

యుగాన్తే సమనుప్రాప్తే వృథైన బ్రహ్మావాదినః ॥

"ద్వాపరయుగాన్తము అయిన తరువాత అనగ కలియుగమునందు అనుభవములేనిదే అనేకమంది వ్యర్థముగా బ్రహ్మవాదము చేయుదురు."

అదేవిధముగ నేనుకూడ నాలుగు అక్షరములు చదువుకొని అనుభవములేకుండ అధిక ప్రసంగము చేయుదును.

స్వా.ని :- అందులో దోషము ఏమి ఉన్నది? శ్రవణము చేసిన విషయమున మనననిదిధ్యాసనములు జరుగును కదా! వారికి శ్రవణము చేయించుట ఉత్తమమగు కార్యము. దైవప్రకృతికల ప్రవక్తలు ప్రవచించు సమయమున గీతయందలి "ఇన్ద్రియార్థేషు వైరాగ్యమ్" అను వచనమును వివరించుచు తమయందు వైరాగ్యములేనిచో చెప్పుటకు సంకోచించెదరు. అనంతరము వైరాగ్యాది దైవసంపదను సంపాదించెదరు. అసురసంపదకల ప్రవక్తలు ఎట్లు తోచిన అట్లు మాట్లాడెదరు. మనస్సుకు ఏమియూ మార్పును రానీయరు. పైగా విషయలంపటులు కూడా నగుదరు. ఇట్లు ప్రవచనమునందు లాభనష్టములు రెండునూ కలవు. ఈ సంగతి తెలిసికొని ప్రవచనములు చేయవలెను.

అటు తరువాత శ్రీ నిత్యానందస్వామివారు శ్రీ ప్రకాశానంద స్వామివారిని ప్రశ్నించిరి. పూర్వము మీరు రెండు కర్రలు దగ్గరనుంచుకొనెడివారు కదా ? ఇప్పుడు ఒక కర్రయే ఎందుకుంచుకొనుచున్నారు?

CONTINUED ON PAGE 13..

చదవండి! చదివించండి!

**ధ్యానయోగ సర్వస్వము**

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రతులకు: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka, Ongole - 523 002, 08592 - 233271

# హృదయాలలో జ్ఞానదీపం వెలిగించుకోవాలి!

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

భగవంతుడు స్వతహాగా నామరూపరహితుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, భక్తవత్సలుడు. తాను దేహమనే భ్రాంతిని విడిచి తానే అట్టి పరతత్త్వమని గుర్తించడమే కాక, యీ విశ్వంలోని సర్వరూపాలు తనవేనని భక్తులకు నిరూపించగలవాడే నిజమైన గురువు. వాస్తవానికి భగవంతుడు, జీవులను సృష్టించి, వాటి జీవనానికి అవసరమైన దేహప్రకృతుల వ్యవస్థను నిర్మించడమేకాక, వాటికి జీవితపరమార్థాన్నీ, దానిని సాధించే మార్గాన్నీ కూడా తెలిపాడు. వివిధ దేశాలలో, కాలాలలో ప్రవక్తలద్వారా, మహనీయులద్వారా ఈ జ్ఞానాన్ని అందిస్తూనే ఉన్నాడు. అంటే భగవంతుడు సృష్టి, స్థితి, లయకర్తేకాక జీవులకు గురువు కూడాను. ఆయనే పరిపూర్ణుడైన సద్గురువుల రూపంలో భూమి మీద మానవులకి అందుబాటులో ఉంటాడు.

Power House లోని విద్యుత్తే ప్రతి Substation లోనూ లభ్యమైనట్లు. దానినే సక్రమమైన తీగల ద్వారా యిండ్లకి సరఫరా చేసికొన్నట్లు భక్తులు శ్రద్ధా, భక్తులనే సుంకం చెల్లించి నిష్ఠ అనే తీగలద్వారా వారివారి హృదయాలలో జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలి. ఎప్పుడు భక్తి, శ్రద్ధలనే సుంకాన్ని చెల్లించడం మనం అశ్రద్ధ చేస్తామో అపుడు అనతి కాలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఎప్పటికప్పుడు తీగలు సరిగా ఉండేలా చూచుకొన్నట్లు మన మనస్సు ఎల్లప్పుడు సత్వ ప్రధానంగా ఉండేలా చూచుకోవాలి.

సాయిలో పై చెప్పిన భగవంతుని లక్షణాలన్నీ సంపూర్ణంగా కనిపిస్తాయి. ఆయనకు పేరులేదు. "భగవంతుడే తండ్రి (భగవంతుడు గూడా తనకు తానేతండ్రి – స్వయంభువు! మహనీయుల రూపంలో తననుతానే సృష్టించుకొంటాడు). ప్రకృతే నాతల్లి, వారిద్దరి కలయికచేత నాకీదేహము వచ్చింది." అన్నారు బాబా. మిగిలిన దైవలక్షణాలన్నీ ఎంత స్పష్టంగా, విస్తృతంగా భక్తులకు ఆయనలో ప్రకటమయ్యేవో 'సాయిలీలామృతం' చూస్తే తెలుస్తుంది. ఇటువంటి సద్గురువును మనం ఎలా సేవించి తరించవచ్చో బాబా తమ గురుసేవా వృత్తాంతంలో తెలిపారు.

సాయిబాబాగారి గురువుకు ఊరు, పేరు లేదు. సాయిని కొందరు హిందువు అని తలచినట్లే సాయిగూడా తమగురువు 'రోషన్‌షా' అని ఒకసారి, 'వెంకూసా' అని ఒకసారీ చెప్పారు. భగవంతుడు హిందువు కాదు. కాని వివిధ మతస్థులందరికీ వారి వారి ప్రవక్తల రూపంలో వారి అనుగ్రహరూపమైన గురుతత్త్వమే ప్రకటమై ఆయా పేర్లతో పిలువబడింది. ఈనాడు సాయిబాబాలో గూడా మనకిదే తత్త్వం గోచరమవుతుంది.

బాబా గురువు నిరంతరం తమ పరమాత్మ తత్త్వంలో నిశ్చలంగా నిలిచారు. వారి దేహం మాత్రం మొదట భగవత్ ప్రాప్తికై జనన, మరణ రూపమైన అజ్ఞానపుటడవిలో అన్వేషించే సాయిబాబాకూ, వారి ముగ్గురు మిత్రులకూ పేద కర్షకుని లాగా దర్శనమిచ్చి, మొదట వారి ఆకలి దప్పులనుదీర్చి పరామర్శింపజూచారు. భూమిమీద భగవంతుడు ప్రవక్తల, మహనీయుల రూపంలో అవతరించి అభ్యుదయ నిశ్రేయసారము లభింపచేసే ఆధ్యాత్మిక జీవిత విధానాన్ని అందించినట్లు. కానీ ఆ నలుగురు అన్వేషకులలో బాబా ఒక్కరే గురుని నిర్హేతుకమైన ప్రేమ నంగీకరించినట్లు ఎప్పుడూ మానవులలో కొందరే ఆధ్యాత్మిక జీవితాన్ని అంగీకరిస్తారు. అలానే సాయికూడా మొదట తన భక్తులకు ఐహికమైన కోర్కెలను తీరుస్తారు. వారి భౌతికరూపంగూడా భగవంతుడు మనపట్ల అనుగ్రహింప భూమిపై అవతరించినదే. భగవంతుడు

భూమిపైన అవతరించినా తన నిజతత్వాన్ని ఎలా తృటియైనా మరువడో అలానే సాయిబాబా, వారి గురువు కూడా అలానే ఉంటారు. అటుపైన శాశ్వత దుఃఖ నివృత్తమైన పరమార్ధాన్ని కోరిన బాబా ఎదుట వారి గురువు నిశ్చలమైన ఆత్మనిష్టలో కూర్చుండిపోయారు. సాయి తమ దృష్టినంతటినీ ఆయనపై కేంద్రీకరించి, తమ జీవితాన్నంతటినీ వారి సేవకై అంకితం చేశారు. అలానే అనుగ్రహ స్రవంతి రూపమైన లీలలద్వారా లౌకికంగా కొంత వారినుండి ఊరట పొందిన భక్తులు ముముక్షువులై బాబాను గూడ అలానే సేవించాలి. భక్తులననుగ్రహించడంలో సాయి యొక్క లక్ష్యమిదేనని వారే చెప్పారు. నిరంతర ఆత్మనిష్ఠులైన సాయి యొక్క ప్రతిరూపము, వారినుండి వేరుకాని వారి పటాన్ని మనంగూడా అలానే సేవించాలి. మొదట భక్తులకు రూపం అవసరం గదా!

బాబావలె వారి గురువునంగీకరించి సేవించని వారి మిత్రులు (సాయిబాబా గురుసేవా వృత్తాంతంలో) పరమార్ధానికై అన్వేషించడమాని, ఆకలి దప్పులతో అజ్ఞానపుటడవిలో పరిభ్రమిస్తూండిపోయారని బాబా చెప్పారు. అలానే మొదట లౌకికంగా సాయినుండి రక్షణ పొందిన భక్తులు సమర్ధుడైన వైద్యుని సంరక్షణకు రోగులు తమను తాము అర్పించుకొన్నట్లు ఆత్మసమర్పణ చేసికొని సాయిని పరమార్ధానికై సద్గురువుగా సేవించాలి. లేకుంటే వారిలోని మందమైన ముముక్షత్వం కాస్తా అంతరించి వారుగూడా జన్మచక్రంలో పరిభ్రమిస్తారు. "గురువును గుర్తించి సేవించాలి. లేకుంటే జన్మకెందుకొచ్చినట్లు? పిడకలేరుకోడానికా?" అని, "గురువుకు పగ్గాలప్పగించాక చింతకు తావేలేదు" అని సాయి అన్నారు. అంటే నిష్ఠ, ఓరిమిలతో సాయి సేవలో, ధ్యానంలో, వారి భక్తిలో నిమగ్నం కావాలి.

---

CONTINUED FROM PAGE 11

## ద్వైతాద్వైతముల వినోదము

స్వా.ప్ర :- మూడు సంవత్సరములకు పూర్వము రాజకోటకు నారాయణపరమహంస అని పేరుగల ఒక చాలాగొప్ప మహాత్ముడు వచ్చెను. ఆయన దర్శనమునకు నేను వెళ్ళితిని. వారు మిక్కిలి విరక్తికలవారుగా కన్పట్టిరి. తరువాత వారిజాడ తెలియలేదు. రెండు సంవత్సరముల తరువాత 'చాందోద' నుండి 'కరనాలి' వెళ్ళుచుంటిని. నాతో నున్నవారు "హనుమంతేశ్వరమునందు గొప్పమహాపురుషుడు ఒకరు కలరు. వారిదర్శనమునకు మీరు అక్కడకు వచ్చెదరా?" అని అడిగిరి. నేను కూడా వారివెంట వెళ్ళితిని. కేశములను ధరించియుండుటచే నేను వారిని గుర్తించలేకపోయితిని. కాని వారు నన్ను గుర్తించిరి. ఆ సమయమున వారు మౌనమును అవలంభించియుండిరి. వారు వ్రాసి-నన్ను ప్రశ్నించిరి. "మిమ్ము రాజకోటలో చూడలేదా?" దీనితో పాటు వారు పరిచయమునకు సంబంధించి కొన్ని సంగతులను కూడా జ్ఞాపకము చేసిరి. "తమకు అన్నియును జ్ఞాపకము ఉన్నవే" అని నేనంటిని. "దొంగతనముగా ఇక్కడ కూర్చొని ఉన్నారా"? అంటిని. కాని వారు సంజ్ఞత తెలిపిరి. "మీరు నన్ను గుర్తుపట్టలేదు. నేను మిమ్ముగుర్తు పట్టితిని. కావున మీరు దొంగ." నా దగ్గర రెండుకర్రలు చూచి సంజ్ఞతో ప్రశ్నించిరి. "రెండు ఏల నుంచుకొనిరి"? నేను చెప్పితిని. "ఇంకను నాకు ద్వైతభావము పోలేదు. అందుచే రెండుకర్రలు ఉంచుకొనియున్నాను." ఆయన నా దగ్గరనున్న కర్రలలోనుండి ఒకదానిని తాను తీసికొని రెండవదానిని నాకు ఇచ్చి సంజ్ఞతో ఒకవ్రేలును చూపించి చెప్పిరి. "ఇప్పుడు అద్వైతము కుదిరినదా?" నేను ప్రశ్నించితిని. "నాకు అద్వైతోపదేశము నిచ్చుచున్నారా?" అంతట వారు నమస్కరించి సంజ్ఞచేసిరి. "కాదు, కాదు". అప్పటినుంచియు ఒకటే ఉంచుకొనుచున్నాను.

స్వామి శ్రీ నిత్యానందులవారు శాస్త్రిగారిని ప్రశ్నించిరి. "ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము మొదలగు పేర్లతో ప్రచారములోనున్న మతములలో ఏ మతము నిజమైనది?"

**- సశేషం**

# శ్రీ భరద్వాజ లేఖామృతము

OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A.P.)

Date 15/4

[illegible]

[illegible]

# శ్రీ భరద్వాజ లేఖామృతము

**OM SADGURU SAINAADHAYA**

**E. BHARADWAJA**, M.A.
Dwarakamayi
P.O. Vidyanagar - 524413
Nellore District (A.P.)

Date : 15/6

చి॥ శ్రీదేవికి,

ఆశీస్సులు. ఈ రోజు తీవ్ర ధ్యానం చేస్తుండగా నిష్కారణంగా ఒక తలంపు మెరిసింది మనస్సులో. నీవు హిందీ చదువుతున్నావుగదా! చదువు కాటంకంలేని విధంగా రోజూ 10 పేజీలు (పరీక్షల ముందు లాంఛనంగా రోజు కొకటి రెండు చాలు) తక్కువ లేకుండా, 'శ్రీ సాయి లీలామృతము' సరళమైన హిందీలోకి భావం వచ్చేలా నీవు అనువదిస్తే బాగుంటుందని. హిందీ ప్రాంతాల వారికి 'సాయి సచ్చరిత్ర' తప్ప సరియైన సాహిత్యమే లేదు. ఇప్పుడు మూర్తి, విజయ కుమార్‌లు మధ్యప్రదేశ్‌లో T.M. చేస్తూ బాబా గూర్చి ప్రచారం చేస్తున్నారు. మనం వాళ్ళకు పుస్తకం లభ్యం చేయగల్గితే చాలా బాగుంటుంది. ఢిల్లీ, నాగపూర్‌లలో సులోచన వెళ్లినపుడు ఆ అమ్మాయి ద్వారా బాబాకు పరిచయమైన Instructors అంతా బాబా ప్రచారం, సత్సంగం చేయడానికి వినియోగపడుతుంది. అంతమందికి ముందు ముందు దశాబ్దాలపాటు, శతాబ్దాల పాటు రచన ద్వారా మేలు చేసిన, సాయిసేవ చేసిన ఫలితం లభిస్తుంది. ఎంతో గొప్ప సాధన. అందుకే ఆంగ్ల, ఆంధ్ర భాషలలో నేనంత శ్రద్ధగా చేసినది. ఆ అవకాశాన్ని నీవు త్వరగా దీక్షతో నిర్వర్తిస్తే వచ్చే విజయదశమికి వ్రాత ప్రతినిగానీ లేక ముద్రిత గ్రంథాన్ని గానీ శిరిడీలో అర్పించవచ్చు. ముద్రణ సంగతి నేను చూచుకుంటాను. అలానే 'ఏది నిజం'? 'నిజానికి నిచ్చెనలు' గూర్చి యత్నిస్తే బాగుంటుంది. వాటిలో Science పదాలకు హిందీ పదాలు తెలియకపోతే అవి నేను కనుక్కుని పెట్టగలను. కొన్ని లక్షల మందికి రాబోయే కాలంలో ఆధ్యాత్మిక దృష్టి కలగడానికి మనకు ప్రకృతిచ్చిన దేహ మనస్సులను వినియోగించడం, అనన్యచింత, నిష్కామ కర్మ, జ్ఞానయజ్ఞం అన్నీను. ఆలోచించి నీ వీలు తెలుపు. గురుపూర్ణిమ నాటికి ఎంత వీలవుతే అంత చేస్తే బాగుంటుందని నాకనిపిస్తున్నది.

అందరం క్షేమం. విశాఖ నుండి జాబు వచ్చింది. వచ్చేవారంలో అన్నయ్య వస్తారట. మంగకు 60% జబ్బు తగ్గినదనీ, మిగిలిన దోషమంతా మోచేతిలో గూడినదనీ, అది ఇక తగ్గనారంభిస్తుందనీ రాస్తూ దానికి మందులు పంపారు. కనుక భయంలేదు. వేదవతి బాగా ఆడుతున్నది. నేను తీరిక లేకుండా బాబా మందిరసేవలో ఉన్నాను. 'ఏది నిజం?' పునర్ముద్రణ జరుగుతున్నది. అనసూయ form fill up చేసి పంపాము. రాజమండ్రి నుంచి M.Com. Exam వ్రాయడానికి వెంకటేశ్వరరావు 17న తిరుపతి వస్తాడు. వాపసులో ఇక్కడికి రావచ్చు. బనగానపల్లె పంపి అనసూయకు Groupలో help చేయమని చెబుతాను. సత్యం కులాసా. క్రిందటి ఆదివారం వచ్చి వెళ్ళాడు. అమ్మకు నమస్సులు. ధ్యానం, ఆరోగ్యం మీ అందరకూ బాగున్నాయని తలుస్తాను.

ఇట్లు,
ఆశీస్సులతో,
భరద్వాజ.

# శ్రీ దత్తలీలామృతము

November సంచిక తరువాయి (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర) - శ్రీమతి శ్రీదేవి

రాజా! యోగి మనోవాక్కాయ నియంత్రణ కలిగివుంటాడు. అంటే, వాగ్దండము, కర్మదండము, మనోదండము అనే మూడు నియంత్రణలను కలిగిన యోగినే త్రిదండి అని అంటారు. అటువంటి యోగి నిర్మలచిత్తుడై వున్నపుడు అతడికి సకలము ఆత్మమయంగా తోస్తూ వుంటుంది. ఇక అతడికి ప్రియము, అప్రియము అన్న భేదభావనలేవీ వుండవు. మట్టిపెళ్ళను బంగారపు ముద్దను సమానంగా చూస్తూ, సమస్త భూతములందు పరమ దయాళుడై యీ లోకంలో సంచరించే యోగి మరణానంతరం పరబ్రహ్మములో కలసిపోతాడు. అతడికింక జన్మవుండదు.

అలర్కా! వేదపరిజ్ఞానము కలిగివుండటంకంటే యజ్ఞకార్యములు శ్రేష్టమైనవి. వానికంటే జపము, జపముకంటే జ్ఞానము శ్రేష్టమైనది. దానికంటే కూడా నిర్మలధ్యానం ఎంతో ఉత్తమమైనది. అహంకార, మమకారములను వీడి, జన సంగమునువీడి ధ్యానయోగరతుడైన యోగి ఆ యోగసిద్ధిని పొంది, నిత్యానందస్థితిని పొందగలడు. నిర్మలచిత్తంతో జితేంద్రియుడై, ఏకాంతంలో ప్రసన్నచిత్తముతో ధ్యానయోగ సాధన చేసినవాడు ముక్తిని పొంది తీరుతాడనటంలో ఎలాంటి సందేహము లేదు.

మహారాజా! ఇప్పుడు నీకు ఓంకారమును గూర్చి వివరిస్తాను. ఓంకారము ముక్తి సాధనము అయివున్నది. ప్రణవమే ధనుస్సుగా లక్ష్యమే పరబ్రహ్మముగా యోగి భావించి ఓంకార నాదోపాసన చేయాలి.

ఓమ్ అని పలికినపుడు అకార, ఉకార, మకారములు పైన అర్ధమాత్రలు ప్రతిధ్వనిస్తాయి. అకారము సత్త్వమునకు, ఉకారము రాజసమునకు, మకారము తామసమునకు చిహ్నములు. ఆపైన గల అర్ధ మాత్రమే నిర్గుణబ్రహ్మము. ఈ విషయాన్ని యోగి గ్రహించవలసి వుంటుంది. గాంధార స్వరపూరితమై వుంటుంది. కనుక దీనిని గాంధారి అని కూడా అంటారు. 'ఓం' అని యోగి జపించగానే శిరస్సుపై చీమపారాడిన అనుభూతి యోగికి కలుగుతుంది.

ఓంకారమే త్రిమూర్తులు. మూడులోకములు. మూడు అగ్నులు, త్రివిక్రముని మూడు పదములు. మూడు వేదములు. మూడు మాత్రలు. అకారము భూలోకము, ఉకారము భువర్లోకము, మకారము స్వర్లోకము. అకారము వ్యక్తము, ఉకారము అవ్యక్తము, మకారము చిచ్ఛక్తి - పైనగల అర్ధమాత్ర పరమపదము. అకారము హ్రస్వము, ఉకారము దీర్ఘము, మకారము ప్లుతము. పైనగల అర్ధమాత్ర వ్యాతీతము.

ఈ ఓంకారము పరబ్రహ్మమని గుర్తెరిగి దానిని ధ్యానించిన యోగి యీ సంసారచక్రమును దాటి సకల ఋణాను బంధముల నుండి విముక్తుడై తుదకు పరబ్రహ్మములో లీనమైపోతాడు. అలాకాక కర్మబంధములు యింకా వీడని స్థితిలో వున్న యోగి తన యోగబలముచే తన మరణకాలమును తెలుసుకొనగలిగినట్లయితే, అతడు సరిగా తన అంతిమ ఘడియలలో ఓంకారము నందు మనస్సు లగ్నము చేయటం వలన పునర్జన్మమున మరల యోగియై పుడతాడు కాబట్టి యోగి అయినవాడు తన మరణ కాలమును తెలిసికొనుట వలన లాభమే కానీ నష్టమేమీ లేదు. ఈ విషయాన్ని యోగి

గుర్తుంచుకొనాలి.” అని శ్రీ దత్తాత్రేయస్వామి అలర్కునకు ఉపదేశించాడని కుమారుడు తండ్రికి తెలియజేస్తూ తండ్రితో యిలా అన్నాడు.

“తండ్రీ! దయానిధి శ్రీ దత్తస్వామి యోగికి మరణకాలమును సూచించే అరిష్టాలను గురించి యీ విధంగా అలర్కునికి తెలియపరచాడు.

ఆకాశంలో ధృవనక్షత్రాన్ని, శుక్రుని, చంద్రుని ఛాయను అరుంధతీ నక్షత్రాన్ని ఎంత ప్రయత్నించినా చూడ లేనట్లయితే, అటువంటి వ్యక్తి ఒక సంవత్సరమునకు మరణిస్తాడు. ఎవడైతే కిరణములు లేని సూర్యబింబాన్నీ, కిరణములున్న అగ్నినీ చూస్తాడో అతడు పదకొండు నెలలకు మరణిస్తాడు. తను విసర్జించే మలమూత్రములు, వెండి, బంగారు వన్నెలలో కలలోగానీ, ప్రత్యక్షంగా కానీ ఎవనికైతే కన్పిస్తాయో అతడు పది నెలలకు మరణిస్తాడు. బంగారు వన్నెగల వృక్షములను గానీ ప్రేతపిశాచాది గంధర్వనగరాలను గానీ చూసేవాడు తొమ్మిది నెలలకు మరణిస్తాడు. ఏ వ్యాధిగానీ, ఏ కారణముగానీ లేకుండా అకస్మాత్తుగా ప్రకృతి విరుద్ధముగా అతిలావుగా వున్న వ్యక్తి కృశించినా, కృశించి వున్న వ్యక్తి లావుగా మారినా అటువంటివాడు ఎనిమిది నెలలకు మరణిస్తాడు. దుమ్ములోగానీ, బురదలోగానీ పెట్టబడిన పాదము కొంత భాగము ఖండించబడినట్లు కన్పిస్తే అటువంటివాడు ఏడు నెలలకు మరణిస్తాడు. గ్రద్ద, పావురము, కాకి, మాలకాకి, మాంసము తినే ఏదైనా నల్లని పక్షి తల మీద వాలితే ఆ వ్యక్తి ఆరు నెలలకు మరణిస్తాడు. నిష్కారనముగా కాకులు తన్నితే వాడు అయిదు నెలలకు, తన శరీరపు నీడ తనవలే కాక వేరు విధముగా కన్పిస్తే అతడు నాలుగు నెలలకు మరణిస్తాడు.

దక్షిణ దిక్కున మేఘములు లేకుండా మెఱుపులు కన్పించినా, రాత్రులందు ఆకాశంలో యింద్ర ధనస్సు కన్పించినవాడు మూడు నెలలకు మరణిస్తాడు. నేతి యందు గానీ, నూనెలోగానీ, నీటిలోగానీ అద్దములోగానీ తలలేని తన శరీరము కన్పిస్తే వాడు ఒక్క నెలలో మరణిస్తాడు. తన శరీరము గొఱ్ఱె కంపు కొట్టినా, శవము వాసన వచ్చినా వాడు పదిహేను రోజులలో మరణిస్తాడు. స్నానము చేసిన వెంటనే గుండె, కాళ్ళు ఎండి పోయినట్లయితే, నీరుత్రాగినా యింకా దాహము వేసినా వాడు పది రోజులకు మరణిస్తాడు. గాలిసోకితే తన మర్మస్థానము మంట పుట్టినయినచో, వెన్నెలకూడా తనకు ఆహ్లాదంగా అనిపించకపోతే అతని మృత్యువు సమీపించిందని తెలుసుకొనాలి. ఎలుగుబంటిపై గానీ కోతిపై గానీ కూర్చుని పాటపాడుచూ దక్షిణ దిశగా పోతున్నట్లుగా కలవచ్చినట్లయితే అతనికి మృత్యువు ఆసన్నమౌతుంది. ఎఱ్ఱని చీరెగానీ, నల్లని చీరెగానీ కట్టుకున్న స్త్రీ నవ్వుచు, పాడుచు తనను దక్షిణ దిక్కుగా తీసుకొని పోవుచున్నట్లు కలగన్న వానికి మృత్యువు ఆసన్నమగును. వివస్త్రుడై నవ్వుచున్న క్షపణకుని కలలో చూచిన వ్యక్తికి, భయంకరులైన వికృతరూపులైన నల్లని పురుషులు ఆయుధములు ధరించి రాళ్ళతో తనను కొట్టినట్లుగా కలగన్నవానికి మృత్యువాసన్నమగును. సూర్యోదయ సమయమున నక్క విపరీతముగా అరచుచు ఎదురుగా వచ్చి అపసవ్యముగా పోయిన సద్యోరిష్టము. అనగా వెంటనే ఆ వ్యక్తికి మృత్యువు సంభవిస్తుంది అని అర్థం. అన్నము తిన్న వెంటనే ఆకలి వేస్తున్నట్లయినా, దంత వ్రణము కల్గినా సద్యోరిష్టము. ఆముదపు దీపం ఆరిపోతే ఆ వాసనను గుర్తుపట్ట లేనట్లయినా నిష్కారణముగా రాత్రింబగళ్ళూ భయము వేస్తున్నట్లయితే, యితరుల కంటిపాపలో తన ప్రతిబింబం కనపడక పోయినట్లయినా సద్యోరిష్టము. అర్థరాత్రి యింద్ర ధనస్సు, పగలు నక్షత్ర గణము కన్పించినట్లయినా, నాసికాగ్రము (ముక్కుకొన) వంగినను, చెవులలో ఒకటి వ్రాలిమరొకటి వ్రాలకున్నను. ఎడమ కంటి నుండీ నీరు కారుచున్నట్లయినా, ముఖము ఎఱ్ఱబడి, నాలుక నల్లబడినట్లయినా సద్యోరిష్టము.

ఒంటెలులాగు బండిమీదగానీ, గాడిదలు లాగు బండిమీదగానీ కూర్చుని దక్షిణ దిశగా వెళుతున్నట్లు కలగన్నట్లయిన సద్యోరిష్టము. తన చెవులు మూసుకొన్నపుడు లోపల మ్రోత వుండనట్లయినా, నేత్ర జ్యోతి నశించినా సద్యోరిష్టము. తాను పడిన గుంటను పూడ్చివేయగా, అందుండి తాను బయటకు రాలేనట్లు కలగన్నట్లయితే సద్యోరిష్టము. మిడిగుడ్లు పడి రెప్పవాలకున్నట్లయితే, కన్నులు ఎర్రబడి గిరగిరా తిరుగుతున్నట్లయినా, ముఖము వేడిగా నాభి చల్లగా వున్నా సద్యోరిష్టము. తాను ధరించిన తెల్లని వస్త్రం ఎర్రగా గానీ, నల్లగా గానీ కనిపిస్తుంటే సద్యోరిష్టము. తాను అప్పటి వరకు ఎంతో భక్తి ప్రపత్తులతో చూచిన తల్లిదండ్రులను, దేవ, గురు, వృద్ధ బ్రాహ్మణులను చులకనగా చూచుట, దుష్టులను గౌరవముగా చూచుట మొదలైన విరుద్ధ స్వభావం కలిగితే అది కూడా సద్యోరిష్టము.

రాజా! ముందుగానే మృత్యు సమయాన్ని సూచించే యీ అరిష్టాలను యోగులే కాక యితరులు కూడా తెలుసుకొని జాగ్రత్తతో మెలగవలసి వుంటుంది. మరణం ఆసన్నమౌతున్నందుకు బాధపడకూడదు. నిర్భయులై ధైర్యవంతులై మరింత తీవ్రముగా యోగములో నిమగ్నులై వుండాలి. అపుడు యోగసిద్ధిని ప్రాప్తింపజేసే ఉత్తమమైన మరుజన్మ లభిస్తుంది. ఒక్కొక్కసారి అంత్య సమయంలో చిత్తమును యోగములో లగ్నంచేయటం వలన మరణకాలాన్ని యోగిదాటవచ్చును.

ఈ విధంగా మానవుడు తన చివరి సమయము వరకు స్థిరమైన చిత్తముతో యోగరతుడై వున్నట్లయితే త్వరితగతిన మోక్ష ప్రాప్తిని పొందగలడు అని దత్తాత్రేయస్వామి అలర్కునికి ఉపదేశించారని సుమతి తన తండ్రికి చెప్పాడు.

సుమతి తండ్రితో యింకా యిలా అన్నాడు – అలర్కుడు తన దృష్టిని స్వామిపైననే కేంద్రీకరించి శ్రద్ధతో స్వామి మాటలనాలకిస్తున్నాడు. స్వామి ఎంతో వాత్సల్యపూరిత దృక్కులతో అలర్కుని వైపు చూస్తూ యిలా అన్నారు – "రాజా! విన్నావుగా, మానవుడికి కలిగే దుఃఖమునకు మూలకారణమేమిటో ? దానిని నిర్మూలించే విధానాన్ని కూడా తెలిసికొన్నావుగా?"

అలర్కుడు ఆనందంతో, నీరు నిండిన కళ్లతో స్వామితో యిలా అన్నాడు – "స్వామీ! ధన్యుడను. మీ అమృత వాక్కులు విన్నాను. తత్త్వరహస్యాన్ని తెలుసుకొన్నాను. ఇక మీ అనుగ్రహంతో, ఆశీస్సులతో యోగరతుండను కాగలను. స్వామీ! నన్ను దీవించండి" అంటూ స్వామి పాదాలపై పడి వేడుకున్నాడు. స్వామి అతనిని లేవనెత్తి యిలా అన్నారు – "రాజా! ఒక విషయాన్ని గమనించు –

"సూర్యకాంతమణి సూర్యకిరణాల చేతనే ప్రజ్వరిల్లుతుంది. చంద్రకాంతమణి వెన్నెల కిరణాలతోనే కరగిపోతుంది. అదే విధంగా యోగి యోగం చేతనే తన జన్మ సార్ధకం చేసుకోగలుగుతాడు. అంతేకాదు, యోగికి తన శరీరం పట్ల గల భావము కూడా నిర్లిప్తంగా వుండాలి. దానిపై వ్యామోహం ఎంతమాత్రమూ వుండకూడదు. చూడు, రాజా! గృహస్తుల యిండ్లలో రకరకాల జీవులు నివసిస్తుంటాయి. చీమలు, దోమలు, ఎలుకలు, బల్లులు – యిలాంటివన్నీ ఆ కుటుంబ సభ్యులతోపాటు తమ స్వంత యింటిలోవలే స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి. ఆ యింట్లో తమకు ఏదైనా హాని వాటిల్లినట్లయితే నిశ్చింతగా వేరొక చోటికి వెళ్ళి పోతాయి. సరిగ్గా యోగి కూడా యిలాగే వుండాలి. తన శరీరాన్ని ఆశ్రయించుకొని యోగాభ్యాసం చేస్తూ జీవించే యోగి ఆ శరీరానికి ఏదైనా హాని కలిగితే బాధపడకూడదు. తుదివరకు యోగ సాధన చేస్తూ ఉత్తమమైన మరుజన్మనుపొంది తిరిగి యోగాన్ని కొనసాగించాలి. యోగము ఎప్పటికి సిద్ధిస్తుందో అనే చింత యోగికి వుండకూడదు. అధైర్యపడకూడదు. చూడు, చీమ ఎంత? దాని ముక్కు ఎంత ? ఆ ముక్కుతో తెచ్చే మట్టి ఎంత ?

CONTINUED ON PAGE 22..

# మాష్టర్‌గారు చెబుతున్నారు

ఓం సమర్థ సద్గురు సాయినాథాయ నమః

భగవంతుని అనుగ్రహంవల్లనే కష్టాలు తొలగేటట్లయితే, భగవంతుడు మన కర్మను రద్దుచేయగలిగినట్లయితే, మనం సత్కర్మలు చేయాల్సిన అవసరం లేదు కదా! చెడు కర్మలు చేసి దానిని బాధించకుండా చేసుకోవచ్చు. మనం చేసిన కర్మలు రద్దు చేయగలవాడు భగవంతుడు అయితే కర్మలు ఎట్లాగంటే అట్లాచేసి చివరకు ప్రార్థన చేయగలిగితే చాలన్నమాట. అయితే ఇక్కడ ఒకటున్నది. అట్లా చేసిన చెడ్డకర్మలు భగవంతుని ప్రార్థనగూడా చేయనివ్వవు. కాబట్టి ప్రార్థించడానికి గూడ కర్మలు సరిగా వుండాలన్నమాట. అంటే ప్రార్థన చేయించేది నీ కర్మలే నన్నమాట. అప్పుడు మళ్ళీ మొదటికే వచ్చాము. అప్పుడు కర్మే ప్రధానమనుకుని, మనం చేసిన కర్మల ఫలితాలనే యిప్పుడు అనుభవిస్తున్నామనుకుని, అవి తీరేనాటికే తీరుతాయని ఓర్పుతోవుంటే సరిపోతుంది. లేదా భగవంతుని ప్రార్థన చేయాలి. మనస్సు అటూ నిలువనీయదు, ఇటూ నిలువనీయదు. ఇదే అవగాహన లోపించడమంటే. ఈ కంగారు ఏం చేస్తుందంటే ఇది పరమార్థానికి మాత్రమే సంబంధించినది కాబోలనుకుని జీవితంలో వుండే సమస్యల గురించి, కర్తవ్య నిర్వహణకంటె మించినటువంటి అనావశ్యకమైన స్థాయివరకూ వాటి గురించి చింతన చేసేలా చేస్తుంది. ఏ విషయం గురించైనా ఆలోచించవలసిందే, ఆలోచించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించవలసిందే. మనమనేది లేకుండా పోయేదాకా కర్తవ్య నిర్వహణ చేయవలసిందే. అందులో అనుమానమేలేదు. కాని ఇక్కడ ఏం జరుగుతుందంటే మనం చేయవలసిన కర్తవ్యమేమిటని ఆలోచించి నిర్ణయించుకుని ఆ కర్తవ్యం చేసిన తర్వాత గూడ దాని గురించి ఆలోచించడం జరుగుతుంది. కర్తవ్యం నిర్వహించిన తర్వాత గూడ దానిగురించి ఆలోచించడం వలన మనస్సు చంచలమై లక్ష్యం చెడిపోవడం తప్ప దానివల్ల జరిగేదేమీ లేదు. అందుకని మనం చేయవలసినది పూర్తిచేసి బాబామీద దృష్టివుంచి ఇహపరాలకు రెండింటికీ ఆయన వున్నాడన్న అవగాహనతో ఉంటే అప్పుడు అంత చంచలమవడం మానేస్తుంది. మనస్సు ఎప్పుడైతే చంచలమవడం మానేస్తుందో చింతపడడం మానేస్తుంది. చింతపడడం మానేస్తుందిగనుక ఆ స్థాయికుండే మనస్సుకుండేటటువంటి రాగద్వేషాదిభావాలు ఎక్కువగా బాధించవు. ఒకప్పుడు మనం కష్టాలలో వున్న ఒకడికి సద్భావంతో సహాయంచేసి వుండవచ్చు. వాడీనాడు హాయిగా వుండివుండవచ్చు. మనకు సహాయం అవసరమైన సమయంలో వాడు సహాయం చేయకపోతే 'నేనప్పుడు వాడికి సహాయం చేసానుగదా, వాడు నాకేమీ సహాయం చేయడంలేదే' అని మనస్సుకు కష్టం కలుగుతుంది. అప్పుడేమో 'వాడు ఋణానుబంధంవల్ల నా దగ్గరకు వచ్చాడు. మనం క్రిందటి జన్మలో ఋణపడ్డాము గనుక వాడికా సహాయంచేయాలని మనకు బుద్ధిపుట్టింది, ఇచ్చాము. వాడు పొందాడు' అని అనిపిస్తుంది. ఇప్పుడేమో ఈ మనోవేదనకు తట్టుకోలేక 'ఒకప్పుడు వాడికోసం మనమంతగా చేసాముగదా! మనం ఇట్లా నలిగిపోతున్నామని తెలిసికూడా వాడెందుకు పట్టించుకోడు?' అనిపిస్తుంది. వాడిమీద కోపం వచ్చేస్తుంది. అంతేగాదు, అటువంటి కృతఘ్నులకే సహాయం లభిస్తుందేమిటి? భగవంతుని దృష్టిలో ఏమిటీ వైపరీత్యం? అని భగవంతునిమీద గూడ బాధ కలుగుతుంది.

అట్లా అనుకుంటే ఏం జరుగుతుందో బాబా ఒక లీల ద్వారా తెలియజేసారు. అట్లా బాధపడుతూ భిక్కూ భాయి తెచ్చిన పూలమాలను, పండ్లను ఆయన తిరస్కరించారు. "దుఃఖంతో తెచ్చిన ఈ మాల నాకొద్దు, ఈ పండ్లు నేను స్వీకరించను" అన్నారు బాబా. అందుకని తృప్తిగా వుండడము అవసరము. తృప్తిగా వున్నవాడు మాత్రమే నిశ్చలంగా వుండగలడు. తృప్తి, నిశ్చలత ఎప్పుడు వీలవుతాయంటే 'మనకు ఆయన వున్నాడు. మనకు ఎప్పుడూ ఎందులోనూ కొరవజరగదు. ఏది అవసరమో అది చేస్తారు' అన్న విశ్వాసం వున్నప్పుడు మాత్రమే కలుగుతాయి. ఆ విశ్వాసం మనస్సులో స్థిరపడాలి. విశ్వాసం కలగాలంటే అప్పుడప్పుడన్నా అనుభవం కలుగుతుండాలి. అనుభవం కలగాలంటే సద్గురువు యొక్క అనుగ్రహము, సాన్నిధ్యము మాత్రమే ఇహపరాలు రెండింటికీ గూడ ఏకైక మార్గము అన్న సంగతి ఎంతగా హృదయంలో వుంటుందో, దాని కోసం అంతగా తపన కలుగుతుంది. దానికోసం తపన ఎంతగా వుంటుందో, దానిపట్ల శ్రద్ధ అంతగా కలుగుతుంది. ఆ శ్రద్ధ ఎంతమేరకు వుంటుందో అంతమేరకు అన్యవిషయాలపట్ల చాంచల్యం లేకుండా వుంటుంది. అందుకని నిష్ఠ, సబూరీలు అర్పించినవాడవుతాడు. అప్పుడు ఆత్మ సమర్పణం పూర్తవుతుంది.

ఆత్మ సమర్పణ జరిగాక తాను చేసేదేమీలేదుగనుక ఆయనమీద దృష్టి పెట్టుకొని నిశ్చితంగా వుండగలుగుతాడు. అపుడు ఏది వచ్చినా చలించడు. ఆ విధంగా ఇష్టాయిష్టాలు లేకుండా ఎప్పుడైతే వున్నాడో, నిష్ఠ, సబూరీలతో ఎప్పుడైతే వున్నాడో, తాను వేరుగా వుండకుండా ఆటలోవలె కర్త, కర్మ అనేది వేరుగా వుండక క్రియ అనే దాంట్లో ఐక్యంచెంది వుంటుంది. నిరంతరం ఆయన (బాబా) ధ్యాసలో వుండడం, నిరంతరం ఆయనను గుర్తు పెట్టుకుంటూ వుండడం అనే దాంట్లో తాను, జగత్తు, జీవితము అనేవి సమన్వయం చెందిపోతాయి. అప్పుడు ఏ అనుభవాలు వచ్చినా, పోయినా రైల్లో నిద్రపోయినవాడికి వలె హాయిగా నిద్రపోతాడు. ఏయే స్టేషన్లు వస్తున్నాయో, కొండలొస్తున్నాయో, గుట్టలొస్తున్నాయో వాడికేమీ తెలియదు. హాయిగా రైలుతోపాటు వాడుగూడ ప్రయాణం చేస్తూ వుంటాడు. మెలకువగా వుండి చింతపడేవాడూ, తిట్టుకునేవాడూ గూడ ప్రయాణం చేస్తూనే వున్నాడు. విసుగు పడేవాడూ ప్రయాణం చేస్తున్నాడు. దీనికే ఒక ఉదాహరణను ఇంతకుముందు అప్పుడప్పుడు ప్రస్తావించడం జరిగింది. రైలు ఎక్కుదామని ముగ్గురు వ్యక్తులు రైల్వే స్టేషనుకు వెళ్ళారు. రాత్రి 9 గంటలకు బండి వెళ్ళిన తర్వాత రైలు నాలుగు గంటలు ఆలస్యంగా వస్తుందని తెలిసింది. ఆ ఊరు ఎలాంటిదంటే స్టేషనునుంచీ యింటికి వెళ్ళాలంటే 3, 4 మైళ్ళు జట్కామీద వెళ్ళాలి. వీళ్ళు ఎక్కివచ్చిన బండి తిరిగి వెళ్ళిపోయింది. కాబట్టి తిరిగి వెళ్ళడానికి బళ్ళులేవు. సమయమూ చాలదు కనుక అక్కడే కూర్చున్నారు. అప్పుడు ఆ ముగ్గురిలో ఒకడేం చేస్తాడంటే - 'ఈ వెధవరైళ్ళు యింతే, మన ప్రభుత్వం వచ్చాక యింతే, ఇదే బ్రిటీష్ వాళ్ళు వున్నప్పుడు ఎలా వుండేది'. అంటూ తిట్టుకుంటూ కూర్చున్నాడు. ఇంకొకడు ఏం చేసాడంటే సంచిలోంచి డిటెక్టివ్ నవల ఒకటి తీసి హాయిగా చదువుకుంటూ కూర్చున్నాడు. మూడవవాడు, రైలెక్కిన తర్వాత మనకు నిల్చోడానికి, కూర్చోడానికీ చోటుంటుందో వుండదో ఎందుకు గొడవ, రైలు వచ్చేలోగా కాస్త నిద్ర తీసేద్దామని ఎక్కడో ఒకచోట ఖాళీ చూసుకుని, ఒక కూలీకి గంటకొట్టగానే తనను లేపమని చెప్పి హాయిగా నిద్రపోయాడు. ఈ ముగ్గురిలో ఎవరు ఉత్తములు?

---

Christmas ప్రత్యేక వ్యాసం

# క్రీస్తు చెప్పిన దేవరాజ్యము లభించేదెవరికి?

'మతం ఎందుకు?' నుండి.

మనస్సుకీ, ప్రాణ చలనానికీ అవినాభావ సంబంధం వున్నందువల్ల అద్వైత భావాన్ని నిలుపుకున్నప్పుడు కూడా క్రమంగా మనోవృత్తులణిగి "అంతటా ఒకేశక్తి, చైతన్యం నిండి ఉన్నాయి" అనే రూపాన్ని సాధకుడి చైతన్యం ధరిస్తుంది. దీనినే 'బ్రహ్మతదాకారవృత్తి' అంటారు. ఈ వృత్తి స్థిరపడినపుడు తాను శరీరానికి పరిమితమైన చైతన్యమేననే భావం తొలగి పోతుంది. ఈ భావం తొలగి పోయిన తర్వాత బ్రహ్మతదాకారవృత్తి నిలుపుకోవలసిన ఆవశ్యకత తొలగి పోతుంది. అదే జీవన్ముక్తి, దానినే ఏసుక్రీస్తు భూమిపైనే సాధించబడే భగవంతుని సామ్రాజ్యంగా (Kingdom of Heaven on earth) చెప్పారు. ఇది ప్రతి వానికీకూడా అందుబాటులోనే ఉన్నదని ("The Kingdom of Heaven is at hand") అని కూడా చెప్పారు. అంత ఉత్తమ స్థితి అందుబాటులో ఉండి కూడా తెలియక అజ్ఞాన పూరితాలైన వికారాల లంపటంలో తాను చిక్కుకొని ఉన్నాడని గుర్తించిన వాడు తన అజ్ఞానానికి సంతాపం చెందకపోడు. ఆ సంతాపాన్నే క్రైస్తవులు Repentence అంటారు. అటువంటి అజ్ఞానాన్ని దాటిన సిద్ధ పురుషుడి వైభవం ఎంతటిదిగా వుంటుందో అన్నది ఏసు ప్రభువు, శిరిడీ సాయిబాబా వంటి మహాత్ములను చూచిన వారందరికీ వారి వారి మనః పరిపాకానుసారం ఆ పరితాప తీవ్రతా భేదంతో కలుగుతుంది. ఆ పరితాపంతో దుఃఖించే వాడు ముక్తిని పొందేవరకూ తన యత్నాన్ని మానలేడు. దీనినే ఏసుక్రీస్తు Blessed are they who mourn for they shall be comforted" ("శోకార్తులు ధన్యులు : వారు ఓదార్చబడుదురు") అని చెప్పారు. అటువంటి పరితాపాన్ని పొందినవారు మొదట ఆస్థితిని చూచుకొని దైన్యాన్ని పొందుతారు. ఆ దైన్యం యొక్క తీవ్రతే యీ పరితాపంగా పరిణమిస్తుంది. అందుకే ఏసుక్రీస్తు, Blessed are the poor in spirit for their's is the Kingdom of heaven, "ఆత్మ విషయంలో దైన్యాన్ని పొందినవారు ధన్యులు; దేవ రాజ్యము వారిది" అని చెప్పారు. అటువంటి వారికి సాధన చేసి పవిత్రతను పొందాలనే కోరిక ఆకలిదప్పులలాగా దుర్భరమై, అహర్నిశలూ వారినావేశిస్తుంది. ఆ స్థితి పొందిన వారికి ముక్తి తప్పక లభిస్తుందని మహాత్ములందరూ ఏకగ్రీవంగా చెప్తున్నారు. ఏసుక్రీస్తు మత్తయి సువార్తలో 5వ అధ్యాయంలో 6వ వాక్యంలో అదే చెప్పారు. ఈ విషయాన్నే హిందూ, బౌద్ధ, ఇస్లాం గ్రంధాలు వివేక వైరాగ్యాలు తీవ్రత చెందినప్పడు భగవంతుని పొందాలనే కోరిక తీవ్రతరమౌతుందనీ, ఆ స్థితిని పొందినవారికి మోక్షం ప్రాప్తిస్తుందనీ చెప్తాయి. కాకుంటే బౌద్ధులు 'దైవం' అనే పదం బదులు 'పూర్ణజ్ఞానాన్ని పొందడం' అన్నారు. వారి గ్రంథాలలోని పర్యాయపదాలైన 'బుద్ధత్వము' 'నిర్వాణము' సరిగా ఇటువంటి సూక్తులే - శ్రీ రామకృష్ణ పరమహంస ఉపదేశాలలోను, ఇంకా ఇతర మహాత్ముల బోధలలోనూ చూడవచ్చు. ఈ స్థితిని పొందిన సాధువులకు గతంలోని వారి అజ్ఞాన స్థితిపైన వారికే తీవ్రమైన దైన్యమూ, పరితాపమూ ఉండటంవల్ల, సాటి జీవుల అజ్ఞానం పట్ల పాపాల పట్ల ఆగ్రహం కలిగేబదులు జాలి, దయ, కలుగుతాయి. ఆ స్థితే దైవానుభవం

వారికి సమీపించినట్లు సూచిస్తుంది. అందుకే ఏసుక్రీస్తు మత్తయి 5:7లో "కృపావంతులు ధన్యులు; వారు కృపను పొందుదురు" అన్నారు! దీనినే భగవద్గీత "సర్వభూతహితే రతాః" (అన్ని భూతముల హితముయందు తీవ్రమైన కాంక్షగలవారు) అని చెప్పింది. దీనిని గురించే బౌద్ధగ్రంథాలలో భోధి సత్వునికి సర్వభూతాలకు ముక్తిని కలిగించేవరకూ తాను పరనిర్వాణము చెందరాదు అన్న కరుణాపూరితమైన నిశ్చయం కలిగినట్లు చెబుతారు. ఆ స్థితిలో సాధకుడి హృదయం తీవ్ర మోక్ష కాంక్షచేత ఇతర వికారాలనుండి పవిత్రత చెందుతుంది. దానిని గురించే ఏసు మత్తయి సువార్త 5:8లో 'నిర్మల హృదయులు ధన్యులు : వారు దేవుని దర్శింతురు' అని చెప్పారు. ఆ స్థాయికి వచ్చినవారు జీవులమధ్య శాంతిని నెలకొల్పి, వారిని మంచి మార్గానికి ఉద్బోధ చేయడం వారికి సహజమౌతుంది. దీన్ని గురించే మత్తయి సువార్త 5:9లో చెప్పి ఉంది - "శాంతి స్థాపకులు ధన్యులు: వారు దేముని కుమారులనబడుదురు" - అని. అందుకే శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ సాయిబాబా, కబీర్, నానక్ వంటి మహాత్ములందరూ జాతి, కుల, మత ద్వేషాలను తొలగించి సామరస్యాన్ని నెలకొల్పబూనారు.

---


చదవండి! చదివించండి!

**శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర**

రచన: ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రతులకు: శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, M.M.Donka,

Ongole - 523 002, 08592 - 233271


CONTINUED FROM PAGE 18..

ఎంత ఓర్పుతో, నేర్పుతో చీమలు చెదలు ఎంతెంత పుట్టలు పెట్టుకొంటాయో చూశావా? ఆవుదూడ కొమ్ము మొదట ఒక చిన్న చుక్కలవలె కన్పిస్తుంది. కాలక్రమేణా దూడ పెరిగి పెద్దదైనపుడు అవి ఎంతో పెద్ద కొమ్ములుగా పెరుగుతాయి కదా! ఇక వృక్షముల విషయానికొస్తే దాని ఆకులను, పూవులను, పండ్లను మనుష్యులు, పశు పక్ష్యాదులు ఎప్పుడూ కోస్తూనే వుంటారు. అయినప్పటికీ వృక్షాలు కృశించి, ఎండిపోక, నిరంతరం పెరుగుతూనే వుంటాయి. అలాగే యోగాభ్యాసం చేస్తూ వున్న యోగి శరీరం ఏమైనప్పటికీ అతని యోగమునకు భంగము కలుగక అభ్యాసం చేత అది పెరుగుతూనే వుంటుంది. ఒక జన్మలో కాకుంటే మరో జన్మలో అతనికి యోగసిద్ధి కలుగక మానదు. నీటితో నిండిన కుండను తలపై పెట్టుకొని మేడ పైకి గానీ, కొండపైకి గానీ ఎక్కుతూ పోయేవారిని చూడు, నీళ్లు ఎక్కడ తొణికి పోతాయోననీ, కుండ పడి పోతుందోననీ వారు ఎంతో జాగ్రత్తగా, నిదానంగా అప్రమత్తంగా నడుస్తుంటారు కదా? అలాగే నిరంతర అభ్యాసం చేత యోగి యోగ సిద్ధిని పొందవచ్చు. రాత్రి నిదురించే ప్రతి ప్రాణిలోను తెల్లవారగానే చలనము, చైతన్యము, జీవిత గమనము ఎంత సహజంగా జరుగుతున్నాయో అంత సహజంగా యోగి క్రమ అభ్యాసం చేత ఎప్పుడో ఒకప్పుడు ముక్తి సాధిస్తాడు. ఈ విషయాన్ని మరచిపోక యోగి పట్టుదలతో యోగం సాగిస్తుండాలి.

- **సశేషం**

---

ద్వారకామాయి అనుభవ మంటపం

# ఆ బాలుడు ఎవ్వరు?

శ్రీమతి సావిత్రి, హైదరాబాద్

నేను ఒకసారి గుంటూరు నుండి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదుకు వస్తున్నాను. మేము చర్లపల్లిలో వుంటాము. రైలు సికింద్రాబాద్ రాగానే పక్కనే రేపల్లె పాసింజర్ వుంది. ఈ రైలు దిగి ఆ రైలు ఎక్కితే, నేను చర్లపల్లి చేరుకోగలను. ఆ రైలు చర్లపల్లి మీదుగా వెడుతుంది. అయితే నేను దిగేవైపు ప్లాట్ ఫాం లేదు. కంకర రాళ్ళ మీద నించి ఆ రైలు ఎక్కాలి. తీరా అటుగాక ఇటు దిగితే ఈ రైలు (నేనెక్కాల్సింది) కదిలి పోతుందేమో... ఇలా ఆలోచిస్తూ బైటికి చూస్తుంటే... అవతలి రైలులో చివరి బోగీ తలుపు దగ్గర (16 సం॥ ఉండొచ్చు) ఒక కుర్రాడు నిల్చుని, రమ్మని సైగ చేస్తున్నాడు. ''హమ్మయ్య పెట్టె అందుకుంటాడులే '' అనుకుని గబగబా వెళ్ళి అతని సహాయంతో ఆ రైలు ఎక్కేసాను. అప్పుడు అతన్ని దగ్గరగా చూసాను. బట్టలన్నీ దుమ్ముకొట్టుకుని పోయి, జులపాల జుట్టుతో పిచ్చాడిలా వున్నాడు. సరే నాకు సహాయం చేసాడు కదాని, 10 రూపాయలు తీసి ఇవ్వబోయాను, ఒద్దని సైగ చేసాడు. అయినా బలవంతంగా అతని జేబులో పెట్టేసాను. ఈలోగా నేను అటు ప్లాట్ ఫాంపైన దిగి, ఇంకా రైలు బయలు దేరటం లేదు కదా, రెండు బోగీలు ముందుకెళ్ళి కూర్చుందాం అని... రైలు దిగి వేరే బోగీలో ఎక్కి కూర్చున్నాను. కూర్చున్న కాసేపటికి ఇందాకటి అబ్బాయి వచ్చి నేనిచ్చిన 10 రూపాయలు నాకిచ్చేసాడు. నాకు చాలా ఆశ్చర్యమేసింది. అయినా ఏదో ఒకటి ఇవ్వాలనిపించి, నా దగ్గర బత్తాయి పండువుంటే అది అతనికిచ్చాను. వెంటనే అతను దాన్ని సగానికి చాలా సునాయాసంగా విరిచి సగం చెక్క నాచేతిలో పెట్టి, మిగిలినది తీసుకుని వెళ్ళిపోయాడు. నాకు వెంటనే అది ప్రసాదమన్న భావన కలిగింది. అతని కోసం మళ్ళీ చూస్తే కనిపించలేదు. తరవాత అనిపించింది, నాకు బాబానే ఈ రూపంలో సహాయం చేసారు. అయ్యో పాదనమస్కారం చేసుకోలేదు... అని!

---

## “సాయిబాబా” పాఠకులకు విజ్ఞప్తి

మీ ''సాయిబాబా''లో ''ద్వారకామాయి అనుభవమంటపం” పున: ప్రారంభం!!! శ్రీ సాయినాధుని, శ్రీ సాయి మాస్టర్ కృపవలన, పారాయణ ఫలితంగానూ మీకు కలిగిన అనుభవాలను మీరు మాకు పంపిస్తే “ద్వారకామాయి అనుభవమంటపం” అనే శీర్షిక క్రింద నెలకు ఒకరి అనుభవం ప్రచురించబడుతుంది. మీరు అనుభవాలు పంపవలసిన చిరునామా –

“ Editor, Sai Baba Monthly Magazine,
Sri Master Universal Sai Trust, M.M.Donka,
Ongole - 523 002 ”

– “సాయిబాబా”

ద్వారకామాయి అనుభవ మంటపం

# నీదే భారం

శ్రీమతి జ్యోతి, హైదరాబాద్

మా చిన్నబ్బాయికి 9 సం॥ల వయస్సులో, స్కూల్లో కళ్ళు తిరిగి పడిపోతే ఇంటికి పంపించేసారు. తరువాత రెండు మూడు రోజులకి పిల్లాడు మన స్పృహలో లేకుండా అయిపోయాడు. ఒక రోజు మధ్యాహ్నం మావారికి ఫోన్ చేసి ఆఫీస నించి రప్పించాను. ఆయన ECIL లో పనిచేస్తారు. హడావిడిగా మా డాక్టర్ దగ్గరికి తీసుకెడితే అపోలోకి తీసుకెళ్ళమన్నాడు. ముందు రోజు మావారు ఆఫీస్ యూనిఫాంలో పర్స్ వగైరాలు పోయాయి. ఆ రోజు కూడా అదే డ్రెస్ వేసుకుని ఆఫీస్ కెళ్ళారు. అదే యూనిఫాంతో హాస్పిటల్ కెళ్ళాం. నేను నా దగ్గరున్న డబ్బులు తీసుకొచ్చాను కనుక ECIL ఎంప్లాయి అని రిక్వెస్ట్ చేస్తే జాయిన్ చేసుకున్నారు. ICU కి పిల్లాడ్ని తీసుకెళ్ళారు. మేము బైట నిల్చున్నాం. పిల్లాడు చాలా పెద్దగా అరుస్తున్నాడు. వాళ్ళు చేసే ట్రీట్‌మెంట్‌కి. నేను మా ఇంటి ఇలవేల్పు వీరభద్రుడ్ని తలచుకుంటున్నాను. మా ఆయన ఆ అరుపులు వినలేక బైయటకి వెళ్ళి పచార్లు చేస్తూ జేబులో చేయి పెట్టుకుంటే, పర్స్ అన్నీ పోయిన కారణంగా ఖాళీ వుండాలి, కాని ఏదో పేపర్ అట్టలాగ తగిలితే, ఏంటా అని చూస్తే, షిర్డిసాయిబాబా ఫొటో. ఈయనకి చాలా ఆశ్చర్యమేసిందిట, మా ఇంట్లో ఇప్పటి వరకు బాబా ఫొటో లేదు, పైగా ఎవరూ ఈయనకి ఇవ్వలేదుట. సరే 'బాబా, నీదే భారం మా బాబుని బతికించ'మని ప్రార్థన చేస్తూ కూర్చున్నారట. కొంత సేపటికి మమ్మల్ని పిలిచారు. బాబుని చూసాం. సాయంత్రానికి పూర్తి స్పృహవచ్చింది. బాబా ఫొటోని మా బాబు తలకింద ఉండే దిండు కింద పెట్టాను. రెండు రోజుల తరువాత మామూలు రూమ్‌కి షిఫ్ట్ చేసారు. అప్పుడు కూడా బాబా ఫొటోని వాడి దిండు కింద పెట్టాను. ఇంతకు వాడి problem ఏమిటంటే రక్తంలో వైట్ సెల్స్ కౌంట్ తగ్గిపోయిందట. మా బాబు బ్లడ్ గ్రూపు వున్న వాళ్ళు ECIL లో మావారి స్నేహితులు వచ్చి రక్తదానం చేసారు. అయితే రికవరీ ఎన్ని నాళ్ళు అన్నది చెప్పలేమని డాక్టర్లు చెప్పారు. కానీ చిత్రంగా రెండు రోజులకే రికవరీ అయిపోయాడు. ఇది మామూలు విషయం కాదు, collect చేసిన రక్తంలో వైట్ సెల్స్ మాత్రమే ఉపయోగం అవుతాయి. అలా బాడీ మామూలుగా అయ్యేదాక ఎక్కిస్తూ వుండాలి. ఇక ఎప్పటికి మేము ఇల్లు ముఖం చూస్తామో అనుకున్నాం. డాక్టర్స్ వాడ్ని డిశ్చార్జి షీటులో, Miracleగా recovery అయ్యాడు అని రాసారు. చిత్రంగా ఇంటికి వచ్చేటప్పుడు దిండు కింద బాబా ఫొటో మాయమయ్యింది. కానీ మా ఇంట్లో, మా హృదయాల్లో బాబా కొలువై వున్నారు.

(బాబు ఇప్పుడు ఉద్యోగం చేస్తూ హాయిగా ఉన్నాడు. అంతా బాబా దయ).

మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు
స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ సాయి సచ్చరిత్ర

**November** సంచిక తరువాయి

## అధ్యాయము – 48

శ్రీ గణేశాయ నమ:, శ్రీ సరస్వత్యై నమ:, శ్రీ గురుభ్యోన్నమ:, శ్రీ కులదేవతాయై నమ: శ్రీ సీతారామ చంద్రాభ్యాం నమ:, శ్రీ సద్గురు సాయినాథాయ నమ:

సపత్నేకర్ కాశీకి బయలుదేరడానికి రెండు రోజులుండనగా అతని భార్యకు ఒక స్వప్నమొచ్చింది. అందువలన అతని కాశీ ప్రయాణం ఆగిపోయింది (101). అద్భుతమైన ఆ స్వప్నం గూర్చి యిప్పుడు చెప్పబోతున్నాను. శ్రోతలారా! శ్రవణం చేయడానికి సంసిద్ధులై వుండండి (102). సపత్నేకర్ భార్యకు వచ్చిన స్వప్నంలో ఆమె నీటి కోసం ఒక బిందెను తీసుకొని 'లక్కడ్‌శా' అనే బావికి వెళ్ళింది (103). అక్కడ వున్న ఒక వేప చెట్టు క్రింద తలకు గుడ్డ చుట్టుకుని వున్న ఒక ఫకీరు వున్నాడు. అతడు ఆమె వద్దకు వచ్చి ఎంతో మృదువైన స్వరంతో ఆమెతో యిలా అన్నాడు : "అమ్మాయీ! నీకెందుకింత శ్రమ. నేను నీ బిందెను మంచినీటితో నింపి యిస్తాను" (104). అతనిని చూచి ఆమె భయపడి బిందెను నీళ్ళతో నింపుకోకుండానే ఖాళీ బిందెతోనే యింటి ముఖం పట్టింది. కానీ ఆ ఫకీరు ఆమెను వెంబడించి వస్తున్నాడు (105, 106). ఇంతలో ఆమెకు మెలకువ వచ్చింది. భార్య యొక్క స్వప్న వృత్తాంతాన్ని విన్న సపత్నేకర్ శిరిడీ వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు (107). వెంటనే భార్యాభర్తలిద్దరూ బయల్దేరి మర్నాటికి శిరిడీ చేరుకున్నారు. వెంటనే మశీదుకు వెళ్ళారు. కానీ బాబా ఆ సమయంలో లెండీకి వెళ్ళివున్నారు (108). బాబా లెండీ నుండీ తిరిగి వచ్చే వరకూ వారిరువురూ ఆయన కోసం ఎదురు చూస్తూ మశీదులోనే కూర్చున్నారు. కొంత సేపటికి బాబా వచ్చారు (109). సపత్నేకర్ భార్య బాబాను చూడగానే ఆశ్చర్యచకితురాలైంది. కలలో తనకు కన్పించిన ఫకీరు ఆపాదమస్తకమూ సాయియే! అందుకే ఆమె కన్నార్పకుండా సాయిని చూస్తూండి పోయింది (110). బాబా పాద ప్రక్షాళనం గావించుకుని వచ్చి మశీదులో కూర్చున్నారు. సపత్నేకర్ భార్య బాబా చెంతకు వెళ్ళి పాదనమస్కారం చేసుకుని బాబాని చూస్తూ అక్కడే కూర్చున్నది (111). ఆమె భక్తి వినమ్రతలకు బాబా ఎంతో ఆనందించారు. ఆమె బాధను నివారించే కథను ఆయన నెమ్మదిగా చెప్పడం ప్రారంభించారు (112). బాబా తమ సహజమైన రీతిన అక్కడ వున్న మూడవ వ్యక్తికి తమ బాధను వర్ణించి చెప్పసాగారు (113). వాస్తవానికి అది సపత్నేకర్ భార్యకు సంబంధించినదే. కానీ ఆమె సమక్షంలో బాబా మూడవ వ్యక్తికి చెబుతున్నారు. ఆ కథను సపత్నేకర్ భార్య గూడ శ్రద్ధగా విన్నది (114). "చాలా కాలంగా నా చేతులు, కడుపు, నడుము విపరీతంగా నొప్పిపెడుతున్నాయి. ఎన్నో మందులు వాడి విసిగిపోయాను. కానీ నొప్పులు ఏమాత్రం తగ్గలేదు. కానీ ఆ నొప్పులు యిప్పుడు హఠాత్తుగా తగ్గి పోయాయి. ఎలా తగ్గాయో నాకు చాలా ఆశ్చర్యంగా వున్నది" (115, 116). బాబా తన పేరు చెప్పకుండా తన కథనే మూడవ వ్యక్తికి చెప్పడంతో ఆమె ఎంతో ఆశ్చర్యపోయింది. తర్వాత ఒకటి రెండు నెలలకు బాబా తన మీద పెట్టుకుని చెప్పినదంతా యదార్థమని ఋజువైంది. ఆశ్చర్యంగా ఆమె నొప్పులన్నీ

తగ్గిపోయాయి (117, 118). శ్రీ సాయిబాబా దర్శనంతో సపత్నేకర్ భార్యకు ఆనందం కలిగింది. కానీ సపత్నేకర్ బాబాకు నమస్కరించగానే ఆయన ఇదివరకటి వలెనే ఛోపొమ్మని కసిరారు (119). సపత్నేకర్ ఎంతో బాధపడ్డాడు "నా పొరపాటు ఏమిటో నాకర్థం కావడం లేదు. బాబా నన్నెందుకిలా తిరస్కరిస్తున్నారు? నేను ఆయన చెంతకు వెళ్ళినప్పుడల్లా నాకు 'వెళ్ళిపొమ్మ'నే మాట ఒక్కటే లభిస్తున్నది (120). నా పూర్వ పాపాల వల్ల బాబా నన్నిలా కోపగించుకుంటున్నారేమో! నేను చూస్తుండగానే ఆయన ఇతరులతో ఎంతో ప్రేమగా వ్యవహరిస్తారు (121). ఉదయము, సాయంకాలమూ గూడ బాబా వద్ద అందరూ ఆనందంగా దీపావళిని అనుభవిస్తున్నారు. మరి నా నొసట మాత్రం వెళ్ళిపొమ్మన్న కఠినమైన వాక్యమే బాబా నోటి వెంట వస్తున్నది (122). మరి నా పూర్వకర్మ ఎంత బలీయమైనదో, నేనెన్నో పాపాలు చేసివుంటాను. అందుకే బాబా ప్రసన్నులు గావడం లేదేమో! (123). మొదట్లో నేనుబాబా విషయమై సంశయించాను. కువిమర్శలు గూడ చేశాను. ఆ కారణంగానే బాబా నాపట్ల యిలా ప్రవర్తిస్తున్నారా?" (124).

సపత్నేకర్ యిలా ఎన్నో విధాలుగా ఆలోచించి చివరకు తన పట్ల బాబా ప్రసన్నులయ్యేవరకూ శిరిడీలోనే వుండి పోవాలని నిశ్చయించుకున్నాడు. స్థిర చిత్తంతో బాబా స్మరణతో గడపసాగాడు (125). తాపత్రయాలతో పీడింపబడుతున్నవారు, సాయి అనుగ్రహం కోసం ఆరాటపడేవారు, అశాంతితో అలమటించేవారు బాబా చెంతకు చేరినపుడు నిరాశతో శిరిడీ నుండి తిరిగి వెళ్ళేవారు ఎవరుంటారు? (126). ఒక రోజు సపత్నేకర్‌కు ఎంతో నిరాశ కలిగింది. అతనికి అన్నపానీయాలు గూడ రుచించలేదు. ఎక్కడికీ కదలబుద్ధి కాలేదు. నిద్రలేకుండా ఒక్కడే మంచం మీద పడుకుని వున్నాడు (127). చివరకు అతడు బాబా వద్ద ఎవరూలేని సమయం చూసుకుని బాబా పాదాలు గట్టిగా పట్టుకోవాలని నిశ్చయించుకున్నాడు (128). ఒక రోజు ఆ శుభ ఘడియరానే వచ్చింది. సపత్నేకర్‌కు అట్టి అవకాశం లభించింది. అతడు వెంటనే బాబా చెంతకు వెళ్ళి బాబా పాదాలను పట్టుకున్నాడు (129). అతడు శిరస్సువంచి నమస్కరిస్తుండగానే బాబా అతని శిరస్సుపై తమ హస్తముంచారు. తర్వాత అతడు బాబా పాదాలు వత్తుతూ కూర్చున్నాడు. ఇంతలో ఒక గొల్ల స్త్రీ వచ్చింది (130). ఆమె బాబా వద్ద కూర్చుని బాబా నడుము మర్దన చేస్తూ వున్నది. బాబా తమ సహజ పద్ధతిననుసరించి ఆమెతో మాట్లాడనారంభించారు (131). సపత్నేకర్ బాబా చేప్పే మాటలను శ్రద్ధతో వినసాగాడు. చిత్రమేమంటే బాబా చెప్పేది అక్షరాలా అతని కథే! (132). బాబా చెప్పేది ఒక వర్తకుని కథ. అందులో మరణించిన అతని పిల్లవాని ప్రస్తావన గూడ వచ్చింది (133,134). తనకు (సపత్నేకర్‌కు) బాగా పరిచయమున్నవాళ్ళు, బాగా దగ్గర సంబంధం వున్న బంధువులు చెప్పినట్లుగా తన పిల్లవాడు పుట్టింది మొదలు మరణించేవరకూ జరిగిన సంగతులన్నీ వివరంగా చెప్పారు బాబా (135). బాబా ఆ గొల్లస్త్రీతో ఆ కథ చెబుతున్నారు. కానీ అది ఏమాత్రం ఆమెకు సంబంధించింది కాదు. ఆ తండ్రీ కొడుకులు వృత్తాంతమంతా తనదే! (136). ఈ విధంగా తన వృత్తాంతమే బాబా ముఖతః విన్న సపత్నేకర్ ఆశ్చర్యపోయాడు. బాబాయందు అతనికి పూజ్యభావం పెల్లుబికింది (137). "బాబా సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపుడే! లేకపోతే నా కథంతా కరతలామలకం వలె బాబాకు ఎలా తెలుస్తుంది? ఆయనకు ఈ విశ్వమంతా తమ కుటుంబమే! అంతేకాదు, ఈ విశ్వమంతా తమ స్వరూపమే! అందుకని వారికి తన పర భేదం ఎందుకుంటుంది? వారే సర్వ జగత్తంతా నిండి వున్నారు. వారికి ద్రష్ట, దర్శన, దృశ్యం అనే భేదముండదు. బాబా సర్వజ్ఞులు". ఈ విధంగా సపత్నేకర్

తన మనసులో అనుకుంటుండగానే బాబా ఏమన్నారో శ్రోతలారా! శ్రద్ధగా వినండి (138-142).

అప్పుడు బాబా సపత్నేకర్ కేసి తమ చూపుడు వ్రేలు పెట్టి చూపిస్తూ అక్కడ వున్న వారితో యిలా అన్నారు : "తన పిల్లవాడిని నేనే చంపానని ఇతడు నాపై నేరమారోపిస్తున్నాడు. అరె! నేను లోకుల బిడ్డలను చంపుతానా? మరి వీడు మశీదుకు వచ్చి ఎందుకిలా ఏడుస్తున్నాడు? సరే! నేనిప్పుడొక పని చేస్తాను. మరణించిన ఇతని బిడ్డను మరల ఇతని భార్య గర్భంలో ప్రవేశపెడతాను" (143-145). బాబా మాటలు వింటున్న సపత్నేకర్ ఆశ్చర్యంతో బాబాకేసి చూస్తుండిపోయాడు. అప్పుడు బాబా అతని శిరస్సుపై తమ వరదహస్తముంచి అతనితో యిలా అన్నారు : "ఈ పాదాలు అతిపురాతనమైనవి, అతి పవిత్రమైనవి. నాపై సంపూర్ణ విశ్వాసముంచు. ఇక నీ చింతలన్నీ దూరమైనాయి. త్వరలోనే నీవు కృతార్ధుడవవుతావు" (146,147).

బాబా పాదాలు వొత్తుతూ కూర్చున్న సపత్నేకర్‌కు బాబా యొక్క అమృతవాక్కులు వినడంతో కంఠం గద్గదమై, నేత్రాలు ఆనందభాష్పాలు వర్షించాయి. వెంటనే అతడు బాబా పాదాలపై శిరస్సు వంచి నమస్కరించాడు (148). అష్టవిధ భావాలూ పెల్లుబికగా ఆనందాశ్రువులతో అతడు బాబా పాదాలను అభిషేకించాడు (149). బాబా మరల అతని తలపై తమ అభయహస్తముంచి యిలా అన్నారు : "ఇప్పుడు శాంత చిత్తుడవై సుఖంగా వుండు!" సపత్నేకర్ ఆనందంతో తన బసకు తిరిగి వచ్చాడు (150).

---

# Annadanam List :-

| | | |
|---|---|---|
| 1. Sri N.Subrahmanyam | Kavali | Rs.1,343=00 |
| 2. K.Ramaraju | Hyderabad | Rs.1,500=00 |
| 3. B.Ramesh | Rajahmundry | Rs.1,343=00 |
| 4. Sri Challa Lakshmi Prasanna | Ongole | Rs.1,343=00 |
| 5. Late Dr. C.V. Ratnam Garu | Hyderabad | Rs.1,500=00 |
| 6. Sri A.B.A Ratna Prasad | Machilipatnam | Rs.1,350=00 |
| 7. Sri C.L.Narasimham | Hyderabad | Rs.1,350=00 |

# School List :-

| | | |
|---|---|---|
| 1. Sri A.Ashok Kumar | Ramachandrapuram | Rs.900=00 |
| 2. Sri G. Brahmaiah | Chirala | Rs.500=00 |

# Ashramam List :-

| | | |
|---|---|---|
| 1. Sri M.V. Prasad | Bhopal | Rs.10,000=00 |

# ఆంతరంగిక పారిశుద్ధ్యము – ఆవశ్యకత

- ద్వారకానాధ్

భగవంతుడు అందరిలో ఉన్నాడని, మనలోనూ ఉన్నాడని మహాత్ములు తెలియబరచారు. అంటే నాలోనూ, నా పిల్లలలోనూ, సకల సృష్టిలోను 'సాయి' కొలువై ఉన్నారన్నమాట. అది మరచిపోవుటయే అజ్ఞానమని, అది అరిషడ్వర్గాలకు కారణమని, దుఃఖ దాయకమని, ఆ అజ్ఞానాన్ని తొలగించుకోవటమే సాధన అని, సాధించినవారు తామే 'సాయి' అవుతారని, భగవంతుడిలో ఐక్యం చెందుతారని, వారి రూపాలు భగవత్స్వరూపాలని, వారి బోధలు భగవంతుని వాక్యాలని అందుకే చెప్పారు. నిత్యం సాయిని అనుక్షణం గుర్తుంచుకొని ఉంటే తానే వారౌతారని సాయి చెప్పారు కదా! అంటే తనలోనూ, ఇతరులలోనూ వారే ఉన్నారని గుర్తుంచుకోవడమేకదా కావలసింది! భాగవతాది గ్రంథాలు, శ్రీ సాయిలీలామృతం వంటి చరిత్రలు చదివిన వారెవ్వరూ దీనిని కాదనలేరు. కానీ ఆ ఆలోచన, అవగాహన యొక్క పర్యవసానం ఏమిటి ?

నిత్యం జీవితంలో ఎన్నో సంఘటనలు. మనస్సులో ఎన్నో ఆలోచనలు, ఆశలు, ఆశయాలు, భయాలు, అపోహలు, వివిధ సంఘటనలు, జ్ఞాపకాలు, వ్యక్తులపై అభిప్రాయాలు, ద్వేషాలు, రాగాలు, ఇష్టాలు, అయిష్టాలు. వీటివలన మరిన్ని కోరికలు, ఆశలు, ఆశయాలు. ఇన్నింటితో నిండిన మన అంతరంగములో మనపై మనకున్న అహంకారాది అభిప్రాయాలు, దాని వలన దంభము మొదలైన వికారాలు. మనకు కుటుంబాలు, ఆ కుటుంబాలు ఉండటానికి ఇళ్ళు, వస్తువులు, వేసుకోవటానికి వస్త్రాలు, పూసుకోవటానికి సెంట్లు, మేకప్పులు. ఇవన్నీ చేరాక ఇంట్లో దేవుడికి చోటులేక, మళ్ళీ వారికో బిల్డింగు, దేవాలయం వగైరా. ఇదంతా కొద్దో గొప్పో నడవడానికి కట్టుబాట్లు, ఆచారాలు. మరి ఇంత రద్దీగా ఉన్న జీవితాలలో భగవంతుడికి చోటేది? అనటానికి మాత్రం ఆయన అంతటా ఉన్నాడు. చూడటానికి మాత్రం ఎక్కడా లేడు. ఏమిటీ వైపరీత్యం ?

దీని నుంచి బయట బడటానికీ, ఈ రద్దీలో సైతం భగవంతుడిని చూడటానికీ, గుర్తించటానికీ, గుర్తు పెట్టుకోడానికీ ఏర్పరచబడ్డ విధానాలే సాధనా మార్గాలు. వాటికి మూలం భగవంతుని గూర్చి అవగాహన - అందుకు శ్రవణం. అట్టి శ్రవణం (అంటే 'వినటం' అని స్థూలార్థము) జరిగాక, అంటే పారాయణో, సత్‌గ్రంథ పఠనమో జరిగాక, మననం జరగాలి. అంటే ఆ చదివిన, విన్న విషయాన్ని బాగా హృదయానికి పట్టే దాకా తిరిగి తిరిగి చింతన చేయాలి అని చెప్పారు.

శ్రీ సాయి లీలలు చక్కగా, తగినంతగా, తరచుగా శ్రవణం (అంటే పారాయణ, సత్సంగం) చేస్తూ, అందులో చెప్పబడ్డ లీలను, వాటి ద్వారా సాయి తత్వాన్ని బోధనలను మననం (మననాన్ని పునః శ్రవణము, శ్రవణాన్ని మననము బలపరుస్తాయని గుర్తించాలి. ఒకసారి చదివితే తెల్లారుతుందనుకోవడం సరికాదు. అది ధీరులకు మాత్రమే వీలౌతుంది) చేస్తూవుంటే ఒక చిత్రమైన విషయం స్ఫురిస్తుంది, స్ఫురించాలి.

బాబా ప్రతి జీవిలోనూ ఉన్నారని కొంత మననం చేస్తే, మనలో వారిని, వారి స్మరణను నిలుపుకోవాలని ప్రయత్నిస్తే ఒక దారుణం అర్థమవుతుంది. శ్రీ సాయి మనలో ఉన్నారంటే, వివేకానందులు చెప్పినట్లు, మన హృదయం సాయి సన్నిధి అని అనిపిస్తుంది. శరీరం సాయి మందిరం అనిపిస్తుంది. పూజ్య శ్రీ మాస్టర్‌గారు శ్రీ సాయి లీలామృతంలో "ఈ సద్గ్రంథం చదివిన భక్తుల హృదయాలు సాయి మందిరాలుగా రూపొంది అందరూ శాంతి సౌఖ్యాలతో ఆత్మ పథంలో పయనించగలరని శ్రీ సాయినాథుని ప్రార్థిస్తున్నాను" అని రాశారు కదా! మనం ఆ సద్గ్రంథాన్ని చదివినప్పుడు ఖచ్చితంగా మన హృదయాలు సాయిమందిరాలవుతాయి. కాకుంటే మున్సిపాలిటీ చెత్త కుండీలో ఉండవలసిన చెత్తంతా ఆ శ్రీ సాయిమందిరంలో వారి ప్రతిమ పక్కనే

పడి ఉండటం కూడా కనిపిస్తుంది. సినిమాలు, అశ్లీలాలు ఆస్వాదించే వారికి శ్రీ సాయి విగ్రహానికి, వారి చుట్టూ (ఆ హృదయ మందిరాలలో) అలాంటి అశ్లీల వాల్ పోస్టర్‌లు అంటించి ఉన్నట్లు, మిగిలిన వికారాలు మొదలైనవి మిగిలిన చెత్తలా, అత్యాశలు, అసూయలు మొదలైనవి ఫులిస్తరాకులలా వారి రూపం చుట్టురా కుప్పలు కుప్పలుగా పడి వుంటాయి. ఎంత చెత్త మనలో కనబడుతుందంటే సాయి రూపం కూడా ఆ మందిరంలో కనుమరుగౌతుంది.

"మనం చేసేది ఎవరికీ తెలియకున్నా మనకు తెలుస్తుంది. అలా మనలో అన్నీ తెలుసుకునేది సాయియే!" అని చెబుతుంది శ్రీ సాయిలీలామృతం. అంటే ఖచ్చితంగా మనందరి హృదయాలలో సాయి ఉన్నారన్న మాట. మన వికారాలతో మన హృదయాన్ని నింపుకోవటం శ్రీ సాయి మందిరంలో చెత్త పేర్చటం లాంటిది. ఇతరుల హృదయాలలోనూ వారే ఉన్నారు. కాబట్టి, ఇతరులకు అట్టి వికారాలు కలిగించినా అదే పని చేసినట్లు అనిపిస్తుంది, ఏమంటారు ?

మరి అది అలా ఉండగా మన ప్రయత్నం ఎలా ఉండాలి ? నిత్యం మనలను కంటికి రెప్పలా (రెప్ప కాపాడుతున్నా కనబడదు. కన్ను మూస్తే కానీ రెప్ప కనపడదు, మనస్సు ప్రపంచం నుంచి ప్రతిహరిస్తే కానీ దైవం కనబడనట్లు) కాపాడుతున్న శ్రీ సాయి మనందరి హృదయాలలో ఉన్నప్పుడు వారి సన్నిధిని అలా దురలవాట్లతో నిత్యం కలుషితం చేసుకోవటం ఎంతవరకు సబబు? కాబట్టి వీలైనంత పట్టుదలతో, శ్రద్ధతో అట్టి వికారాలకు తావియ్యకుండా ఉండటం మన ధర్మంకదా? మరి మనం అలా ఉండాలి కదా?

సంస్కారాలో, అలవాట్లో అడ్డమొస్తున్నాయి, ప్రయత్నం చేస్తున్నా వీలు పడట్లేదు అంటే సరే. మన శాయశక్తులా ప్రయత్నం చేస్తే, మనకింక వల్లకాక పోతే శ్రీ సాయి మనలను క్షమించగలరు. మనలను మనం క్షమించుకోవచ్చు. అలా కాకుంటే "ఒకటి రెండు సార్లు చెప్తాను. వినకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను" అన్న సాయి మాటలు పనిచేస్తాయి.

అది అలా ఉంచండి. మన (లేక ఇతరుల) పిల్లల మనస్సులు కూడా సాయిమందిరాలు కదా? మన హృదయ మందిరాలకంటే స్వచ్ఛమైనవి కదా? మరి వాటినైనా మనం కలుషితం చేయకుండా ఉండాలికదా? సినిమాకు వెళ్ళే కక్కుర్తి మనకుంటే, ఆపుకో లేకుంటే, సిగ్గుతో చాటుగా వెళ్ళాలి కాని పిల్లల్ని కూడా తీసుకెళ్ళి వాళ్ళ హృదయాలలోని సాయి సన్నిధిని కలుషితం చేయవొచ్చా? సినిమా అన్నది ఒక ఉదాహరణ. మనం ఏమరుపాటుగా ఆచరించేవెన్నో ఎందరి హృదయాలనో కలుషితం చేస్తాయి. మన హృదయాలలో మురికి ఉంటే మానె, పాపం వాళ్ళ హృదయాలలో కూడా సాయిని ఇబ్బంది పెట్టాలా?

అంటే మనస్సును వీలైనంత వరకు శుభ్రపరచుకోవడానికి, అలా ఉంచుకోవటానికి ప్రయత్నం జరగాలి. దానితో పాటు అవతలవారి హృదయాలను కలుషితం చేయకుండా ప్రయత్నించాలి. వారి హృదయాలను సైతం పరిశుభ్రం చేసేలా శ్రీ సాయి మాస్టర్ తత్వాన్ని వీలైనంత మందికి అందించాలి. ఈ మూడిటినే "స్వాధ్యాయం-ప్రవచనం"గా చెప్పారు పెద్దలు.

అట్టి ప్రయత్నమే ఈ మీ "సాయిబాబా". అలాంటి ప్రయత్నం చేయకుంటే, దానికి సహకరించకుంటే తెలిసి తెలిసి సాయి మందిరాలలో చెత్త పేర్చినవారమవుతాము. అందుకే సద్ధర్మ ప్రచారానికి సహకరించకుంటే నరకమొస్తుందని అన్ని మతాలూ చెప్పాయి. అట్టి ప్రయత్నం, దానికి సహకారం చేస్తే శుద్ధులమవుతాము. కృతార్థులమవుతాము. శుభ్రమార్గాన గమ్యం చేరతాము. అలా అందరినీ అనుగ్రహించమని ప్రార్థన.

జై సాయి మాస్టర్!!

# సూక్ష్మంలో మోక్షం

ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

భోజనంగాని, ప్రసాదంగాని, రుచికరమైన వంటకంగాని ఒకరే తిని ఆనందించడం దోషమని, పాపమని, పుణ్యహరమనీ ధర్మశాస్త్రాలు, సాయివంటి సత్పురుషులూ చెబుతున్నారు. కాకులు గూడ వాటికేమైనా దొరుకుతే సాటి కాకులన్నింటినీ పిలుచుకొని, వాటితో కలసి అనుభవిస్తాయి. అలానే అమూల్యము, అలభ్యమూ అయిన మహత్తర విషయాలనందించే 'సాయిబాబా' పత్రికను సాటివారికి పరిచయంచేసి, నేటికీ సాయి, భక్తులకనుగ్రహిస్తున్న లీలలను చదివి, ఆయన ఆశ్రయాన్ని వారుగూడ పొందేలాగున ప్రేరేపించి సహకరించడము ఉత్తమమైన సాధన, ఉత్తమమైన మానవత్వముగూడ. మనకు కనీసావసరాలనెన్నో అందించిన సమాజానికి మనమెంతగానో ఋణపడతాము. ఆ ఋణాన్ని సులభంగా, ఉత్తమంగా తీర్చుకొనే పద్ధతి 'సాయిబాబా' పత్రికను వారికి పరిచయం చేయడం. అధర్మం వేనోళ్ళ ప్రచారమవుతూండే యీ కాలంలో సద్ధర్మ ప్రచారానికి కొంతైనా సహకరించడం మీ ధర్మం. అలా ధర్మప్రచారానికి సహకరించక పోవడం అధర్మాన్ని పోషించడమే అవుతుంది. మనం లేనప్పుడు మనింట దొంగలు దోచుకొంటూంటే ప్రక్కవారు చూచి వూరుకోడం లాటిదిగాదు? ఒకవంక అంత మాంద్యంతో ప్రవర్తిస్తూ సాయిగాని, భగవంతుడుగాని మననూ, ధర్మాన్నీ రక్షించాలని ఆశించడం సమంజసమా? 'ధర్మోరక్షతి రక్షితః' – 'ధర్మం తానెవరిచేత రక్షించబడుతుందో వారినే రక్షిస్తుంది' అని గదా ఋషి వాక్యం? రోజుకొక్క కాఫీకో, సిగరెట్టుకో, వారానికొక సినిమాకు చొప్పున మనం ఖర్చుచేసే దానితోనైనా ఒక సాటివారికి 'సాయిబాబా' చందాను వారి పుట్టిన రోజునో, వివాహానికో, ఉపనయానానికో, నూత్న సంవత్సరారంభంలోనో బహూకరించవచ్చు గదా? స్వర్గస్థులైన పెద్దల శ్రేయస్సునాశించి ఒక ఆశ్రమానికో, దేవాలయానికో 'సాయిబాబా' పత్రిక తెప్పించడానికో వ్యయం చేయవచ్చు గదా? అంత స్వల్ప ఖర్చుతో ఆ కుటుంబానికి, వారిద్వారా వారి పొరుగు వారికి, ఆలయానికి వచ్చే భక్తులందరికీ వెలలేని వెలుగు బాటను చూపే 'సాయిబాబా'ను అందించవచ్చు గదా! ఆలోచించండి. ఉత్తమమైన సాయి ప్రచారము, సద్ధర్మ ప్రచారమూ ఒక్క సిగరెట్టు, కాఫీ, వక్కపొడి, సినిమా మాత్రం చేయదా? మన దృష్టి అలా వుంటే సాయికి మనం చేసే పూజ, నమస్కారాలకెంత బలముంటుంది? ప్రతి పనినీ అలా చేయడమే శ్రద్ధ; కర్మయోగం, అలాటి జీవితం యజ్ఞమయం. అదే సత్త్వగుణం; అదే దైవీ సంపద. అది లోపిస్తే మన యజ్ఞ దాన తప: కర్మలు నిష్ఫలమవుతాయని భగవద్గీత ప్రమాణం. ఇలా జాగ్రత్త తీసుకోవడంలో అనన్య చింత వుంటే అట్టి వారి యోగ క్షేమాలను మాత్రమే పరమాత్మ చూస్తానన్నాడు గాని అందరివీగాదు. ఇదే సాయి తెల్పిన నిరంతర చింతన. ఒక్క పూట ఆకలి తీర్చే అన్నం పెడితేనే అంతమంచి ఫలితముంటే, జన్మజన్మల సంస్కారాన్నే మార్చి జీవితాలను, జన్మలనుగూడ సంస్కరించే యీ సేవకెంతటి ఫలితమో!

## Statement about ownership and other particulars of SAI BABA (Monthly) FORM - IV (See Rules 8)

| | |
|---|---|
| 1. Name of the Publication | : SAIBABA |
| 2. Periodicity of its publication | : MONTHLY |
| 3. Printer's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 4. Publisher's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 5. Editor's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Master Universal Sai Trust, M.M.Donka, Ongole-2 |
| 6. Name and Address of individuals who own the News papers and Shareholders holding more than 1% of the total capital | : Advisory Member of Master Universal Sai Trust (Regd.), Ongole-2 |

I, P.Srinivasa Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Ongole (Sd.)P.Srinivasa Rao

1-12-2009


**పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీగురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్తవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 20-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |

| | |
|---|---|
| దత్తావతార మహత్త్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 35-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 30-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 22-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 50-00 |
| Supreme Master (Swami Samartha) | 50-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |